


Truth of News

PRGI Reg No: APTEL/26/A4784

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్: మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS

irspublications12@gmail.com

నంద్యాల | సంపుటి: 02 | సంచిక : 08 | ఆదివారం 16 ఆగస్టు 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi

# సంస్కరణలు మరింత వేగం



- రానున్న 5-7 ఏండ్లలో లక్ష్యాలు పూర్తి చేయాల్సి ఉంది
- వికసిత్ భారత్ కోసం సప్తధార విజన్
- ఇతర దేశాలపై ఆధారపడే పరిస్థితి నుంచి దేశం బయటపడాలి
- దేశ అభివృద్ధికి యువతే అతిపెద్ద లబ్ధిదారులు
- ఎర్రకోట నుంచి దేశ ప్రజలనుద్దేశించి ప్రధాని మోడీ ప్రసంగం



**న్యూఢిల్లీ -సూర్య వాస్తవం**

దేశంలో రానున్న 5-7 ఏండ్లలో లక్ష్యాలు పూర్తి చేయాల్సి ఉందని, ఆ లక్ష్యాల సాధనకు సంస్కరణలు మరింత వేగం చేస్తామని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అన్నారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోట వేదికగా ప్రధాని మోడీ వరుసగా 13వ సారి జాతీయ జెండాను ఎగురవేశారు. ఆ తరువాత ఎర్రకోటపై వందేమాతర గేయాన్ని వినిపించారు. ఆర్మీ బ్యాండ్‌తో వందేమాతరాన్ని ఆలపించారు. ఎర్రకోట వేదికపై రెండు ఎంఐ-17 హెలికాప్టర్లు పూలవర్షం కురిపించాయి. ఓ హెలికాప్టర్ జాతీయ పతాకాన్ని మోసుకెళ్లింది. మరో హెలికాప్టర్ వందేమాతరం గేయం రాసిన జెండాను తీసుకెళ్లింది. దేశానికి స్వాతంత్ర్య వచ్చిన తరువాత మొదటిసారి పూర్తిగా వందేమాతరం గేయాన్ని ఎర్రకోట వద్ద ఆలపించారు. అనంతరం దేశప్రజలను ఉద్దేశించి ప్రధాని మోడీ ప్రసంగించారు. దేశవ్యాప్తంగా 'వందేమాతరం' నినాదం మార్మోగుతోం దని, ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం రెపరెపలాడుతోందని అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ దేశాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. గత 12 ఏండ్లలో దేశం అనేక రంగాల్లో గణనీయమైన మార్పును సాధించిందని చెప్పారు.

గత 5-7 దశాబ్దాల్లో సాధించలేక పోయిన లక్ష్యాలను రానున్న 5-7 ఏండ్లలో పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆలోచనా విధానంలోనూ, లక్ష్యాల సాధనలోనూ సంస్కరణలు చేపట్టాల్సిన సమయం వచ్చిందని వివరించారు. 2047 నాటికి 'వికసిత్ భారత్'ను నిర్మించాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. 140 కోట్ల మంది భారతీయుల సంకల్పం, సామర్థ్యమే దేశానికి అతిపెద్ద బలమని అన్నారు. కరోనా మహమ్మారి, యుద్ధాలు, అంతర్జాతీయ

- మిగతా 2లో..



## స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు మళ్లీ దూరంగా

# ఖర్గే, రాహుల్..

## - పాత వివాదమే కారణమా?

- ఎర్రకోటలో జరుగుతున్న 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఖర్గే, రాహుల్ దూరం
- ప్రధాని మోదీ నేతృత్వంలోని కార్యక్రమానికి వరుసగా రెండో ఏడాదీ గైర్హాజరు
- 2024లో రాహుల్‌కు వెనుక వరుసలో సీటు కేటాయించడంపై చెలరేగిన వివాదం
- ప్రతిపక్ష నేతగా ఉన్న రాహుల్‌ను అవమానించారని అప్పట్లో కాంగ్రెస్ ఆరోపణ
- గత వివాదం కారణంగానే ఈసారి కూడా హాజరు కాలేదని విశ్లేషణలు

**న్యూఢిల్లీ-సూర్య వాస్తవం**

ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో ఢిల్లీలోని ఎర్రకోటలో జరుగుతున్న 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్ గాంధీ గైర్హాజరయ్యారు. వారు ఈ కార్యక్రమానికి హాజరుకాకపోవడం ఇది వరుసగా రెండో ఏడాది. ఈ పరిణామం రాజకీయ వర్గాల్లో మరోసారి చర్చనీయాంశంగా మారింది. 2024లో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సమయంలో తీవ్ర వివాదం చెలరేగిన సంగతి తెలిసిందే. లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా కేబినెట్ మంత్రి హోదాలో ఉన్న రాహుల్ గాంధీకి సంప్రదాయానికి, ప్రోటోకాల్‌కు విరుద్ధంగా వెనుక వరుసలో సీటు కేటాయించారు. ఇది ప్రజలను అవమానించడమేనని అప్పట్లో ప్రతిపక్షాలు

- మిగతా 2లో..

# సంక్షేమం, అభివృద్ధి జోడెద్దులు..

- ఏటా డీఎస్సీ, యువతకు 20 లక్షల ఉద్యోగాలు: సీఎం చంద్రబాబు
- 2047 నాటికి స్వర్ణాంధ్ర నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమన్న ముఖ్యమంత్రి
- సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యం ఇస్తున్నామని వెల్లడి
- ఏటా డీఎస్సీ నిర్వహిస్తామని, యువతకు భారీగా ఉద్యోగాలు కల్పిస్తామని హామీ
- వచ్చే ఏడాది మార్చి నాటికి పోలవరం పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామన్న సీఎం
- అమరావతిని ప్రపంచ స్థాయి నగరంగా నిర్మించి తీరుతామన్న సీఎం చంద్రబాబు





**అమరావతి -సూర్య వాస్తవం**

అభివృద్ధి, సంక్షేమాన్ని సమతూకం చేస్తూ 2047 నాటికి రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రగా తీర్చిదిద్దడమే తన ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. విధ్వంసం నుంచి వికాసం వైపు అడుగులు వేశామని, ఇక వికాసం నుంచి వైభవం వైపు రాష్ట్రాన్ని నడిపిస్తామని ఆయన పిలుపునిచ్చారు. రాజధాని అమరావతిలో జరిగిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం ఆయన ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలతో పాటు చెప్పనివాటిని కూడా అమలు చేస్తూ ప్రజా సంక్షేమానికి

- మిగతా 2లో..

## నీటి హక్కుల విషయంలో

# రాజీపడేదే లేదు



- పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేస్తాం..రైతుల కండ్లల్లో ఆనందం చూస్తాం
- విద్యాసూచీలో రాష్ట్రాన్ని 18వ స్థానానికి చేర్చాం
- మట్టిలో మాణిక్యాలను వెలికి తీసేందుకే సీఎం కప్
- టీజీఐపాస్ ద్వారా 1.29 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించాం
- 2034 నాటికి కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే మా లక్ష్యం - ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి - గోల్కొండ కోటలో జాతీయ జెండావిష్కరణ

**హైదరాబాద్-సూర్య వాస్తవం**

కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణకు దక్కాల్సిన నీటి హక్కుల విషయంలో రాజీపడేదే లేదని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రానికి రావాల్సిన ప్రతీ నీటి బొట్టునూ సాధించి తీరుతామన్నారు. తుమ్మడిహెట్టి నుంచి పాలమూరు వరకు పెండింగ్ లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను ప్రాధాన్యక్రమంలో పూర్తి చేసి చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందిస్తామని ఆయన హామీనిచ్చారు. వ్యవసాయాన్ని పండుగగా మార్చి రైతుల కండ్లల్లో ఆనందం చూస్తామని వ్యాఖ్యానించారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శనివారం సీఎం రేవంత్ రెడ్డి హైదరాబాద్ లోని గోల్కొండ కోటలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. అంతకు ముందు వేడుకలకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన సీఎంకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, డీజీపీ సీవీ ఆనంద్ స్వాగతం పలికారు. అనంతరం పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించిన ముఖ్యమంత్రి... రాష్ట్ర ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. తమ 32 నెలల పరిపాలనలోసాధించిన విజయాలు, అమలు చేసిన పథకాలు, వాటి ఫలితాలను ఆయన సోదాహరణంగా ఏకరువు పెట్టారు. 2025-26లో రాష్ట్ర తలసరి ఆదాయం రూ.4,18,932 (దేశ తలసరి ఆదాయం కంటే 91 శాతం అధికం)గా ఉండటాన్ని రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బలమని ఆయన అభివర్ణించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు వ్యవసాయం, రైతు సంక్షేమానికి దాదాపు 1.70 లక్షల కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. వరి సాగు, విస్తీర్ణంలో

- మిగతా 2లో..

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

# జెన్-జీ శక్తితోనే మార్పు..



- అవినీతి, కులాలపై పోరాటమే నిజమైన స్వేచ్ఛ
- తొలి స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో విజయ్
- చెన్నైలోని చారిత్రాత్మక ఫోర్ట్ సెయింట్ జార్జ్‌లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు
- అవినీతిని అంతమొందించడం రెండో స్వాతంత్ర్య పోరాటం లాంటిదేనన్న విజయ్
- స్వాతంత్ర్య సమరయోధుల పింఛనును రూ. 23 వేలకు పెంచుతున్నట్టు ప్రకటన

## బెంగళూరులోని మానేక్ షా పరేడ్ గ్రౌండ్‌లో

# జెండా ఎగురవేసిన కర్నాటక సీఎం

- ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ పాల్గొంటున్న తొలి జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఇది.
- సీఎం డీకే శివకుమార్ జెండా ఊపి ప్రారంభించారు
- మానేక్‌షా పరేడ్ గ్రౌండ్‌లో జెండా ఆవిష్కరణ

2లో



## స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు మళ్లీ దూరంగా

# ఖర్గే, రాహుల్..

(మొదటిపేజీ తరువాయి)

తీవ్రంగా విమర్శించాయి. అయితే, ఈవెంట్‌ను నిర్వహించిన రక్షణ మంత్రిత్వ శాఖ దీనిపై వివరణ ఇచ్చింది. ఒలింపిక్ క్రీడాకారులకు ప్రాంగణంలో చోటు కల్పించేందుకే సీటింగ్ ఏర్పాట్లలో కొన్ని మార్పులు చేయాల్సి వచ్చిందని తెలిపింది. వాస్తవానికి ప్రభుత్వ ప్రోటోకాల్ ప్రకారం ఇలాంటి అధికారిక కార్యక్రమాల్లో ప్రతిపక్ష నేతకు ముందు వరుసలోనే స్థానం కల్పించాలి. గతంలో జరిగిన ఈ వివాదం కారణంగానే ఈసారి కూడా కాంగ్రెస్ అగ్ర నాయకులు ఈ వేడుకలకు దూరంగా ఉన్నారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రభుత్వంతో ప్రతిపక్షాల మధ్య ఉన్న దూరాన్ని ఈ ఘటన మరోసారి స్పష్టం చేస్తోంది.

# సంక్షేమం, అభివృద్ధి జోడెద్దులు..

(మొదటిపేజీ తరువాయి)

పెద్దపీట వేస్తున్నామని వివరించారు.

**సూపర్ సిక్స్‌తో సంక్షేమ పాలన**

ప్రభుత్వం ఏర్పడిన వెంటనే 'సూపర్ సిక్స్' పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నామని చంద్రబాబు తెలిపారు. పెన్షన్లు పెంచి పేదలకు ఆర్థిక భద్రత కల్పించామని, కుటుంబంలో ఎంతమంది పిల్లలున్నా అందరికీ 'తల్లికి వందనం' పథకాన్ని వర్తింపజేస్తున్నామని అన్నారు. 'స్త్రీశక్తి' ఉచిత బస్సు ప్రయాణ పథకం మహిళలకు వరంగా మారిందని, అన్న క్యాంటీన్లతో పేదల ఆకలి తీరుస్తున్నామని చెప్పారు. త్వరలోనే గ్రామీణ ప్రాంతాల్లోనూ అన్న క్యాంటీన్లను విస్తరిస్తామని హామీ ఇచ్చారు. సమాజంలోని ఉన్నత వర్గాలు అట్టడుగు వర్గాలకు చేయూతనిచ్చేలా 'పీ4' కార్యక్రమాన్ని ప్రారంభించామని, తద్వారా ఆర్థిక అసమానతలు లేని సమాజం కోసం కృషి చేస్తున్నామని వివరించారు.

**యువతే భవిష్యత్తు.. ఉద్యోగాల వెల్లువ**

నవ్యాంధ్ర భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని ఉద్ఘాటించిన సీఎం, వారికి ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. అధికారంలోకి రాగానే తొలి సంతకంతో 15,941 ఉపాధ్యాయ పోస్టులతో 'మెగా డీఎస్సీ 2025'ను పారదర్శకంగా పూర్తి చేశామని గుర్తుచేశారు. ఇకపై ఏటా డీఎస్సీ నిర్వహిస్తామని ఈ వేదిక నుంచి హామీ ఇచ్చారు. ఈ ఏడాది 10 వేల ఉద్యోగాలతో జాబ్ క్యాలెండర్ విడుదల చేశామన్నారు. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని, ఇప్పటికే రూ.24 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులకు ఒప్పందాలు కుదిరాయని, వీటి ద్వారా 11 లక్షల ఉద్యోగాలు వస్తాయని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. గూగుల్ ఏఐ డేటా సెంటర్, ఆర్సెలార్ మిట్టల్ వంటి ప్రఖ్యాత సంస్థలు రాష్ట్రానికి వస్తున్నాయని తెలిపారు.

**రైతు సంక్షేమం.. జలయజ్ఞం**

రైతన్న సంతోషంగా ఉంటేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని నమ్మే తమ ప్రభుత్వం, అన్నదాతలకు అండగా నిలుస్తోందని సీఎం అన్నారు. 'పీఎం-కిసాన్--అన్నదాత సుఖీభవ' కింద రైతులకు ఏటా రూ.20 వేలు అందిస్తున్నామని, ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోనే డబ్బులు జమ చేస్తున్నామని చెప్పారు. లక్ష కోట్లతో రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా మారుస్తామని ప్రకటించారు. సాగునీటి ప్రాజెక్టులపై ప్రత్యేకంగా దృష్టి సారించామని, రూ.35 వేల కోట్లతో 36 ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు ఇరిగేషన్ క్యాలెండర్ విడుదల చేశామని తెలిపారు.

**పోలవరం, అమరావతిపై స్పష్టమైన హామీ**

గత ప్రభుత్వ హయాంలో తీవ్రంగా నష్టపోయిన పోలవరం ప్రాజెక్టును తిరిగి పట్టాలెక్కించామని చంద్రబాబు అన్నారు. రెండేళ్లలో 89 శాతం పనులు పూర్తి చేశామని, వచ్చే ఏడాది మార్చి నాటికి ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని పునరుద్ఘాటించారు. ఐదున్నర కోట్ల ఆంధ్రుల ఆత్మగౌరవానికి ప్రతీక అయిన అమరావతిని ప్రపంచస్థాయి నగరంగా నిర్మించి తీరుతామని స్పష్టం చేశారు. రైతుల త్యాగంతో నిర్మిస్తున్న ఈ రాజధానిలో ప్రస్తుతం రూ.50 వేల కోట్ల విలువైన పనులు శరవేగంగా జరుగుతున్నాయని వివరించారు.

**సుపరిపాలన.. అభివృద్ధి**

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేసి, రెవెన్యూ సంస్కరణల ద్వారా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతున్నామని సీఎం చెప్పారు. అవినీతి రహిత పాలన కోసం టెక్నాలజీని వినియోగిస్తున్నామని, 'మనమిత్ర' వాట్సాప్ ద్వారా 1100కు పైగా సేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు. రామాయపట్నం, మచిలీపట్నం, మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టుల నిర్మాణం వేగంగా జరుగుతోందని, విద్యుత్ రంగంలో సంస్కరణలతో ఛార్జీలు పెంచకుండానే ప్రజలపై భారం తగ్గించామని అన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యమిస్తున్నామని, గంజాయి, డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపుతున్నామని హెచ్చరించారు. అందరి కృషితో వికసిత భారత్ నిర్మాణంలో భాగమవుతూ, స్వర్ణాంధ్రను సాధిద్దామని ఆయన పిలుపునిచ్చారు.

# జెన్-జీ శక్తితోనే మార్పు..

**చెన్నై-సూర్య వాస్తవం**

తమిళనాడు నూతన ముఖ్యమంత్రి విజయ్ తన తొలి స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో రాజకీయ ప్రత్యర్థులకు బలమైన హెచ్చరికలు జారీ చేయడంతో పాటు యువత, సామాజిక మార్పుపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. చెన్నైలోని చారిత్రాత్మక ఫోర్ట్ సెయింట్ జార్జ్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించిన అనంతరం ప్రసంగించిన ఆయన, రాష్ట్రంలో అవినీతిని అంతమొందించడం కూడా ఒక రెండో స్వాతంత్ర్య పోరాటం లాంటిదేనని స్పష్టం చేశారు. రాష్ట్రాభివృద్ధిలో జెన్-జీ, యువతదే కీలక పాత్ర అని పేర్కొన్న విజయ్... కులం, మతం పేరుతో ప్రజలను విభజించే సంకెళ్లను తెంచినప్పుడే దేశంలో నిజమైన స్వేచ్ఛ సాధ్యమవుతుందని అన్నారు. తమిళనాడు హక్కులు, భాషా విధానం, ఆర్థిక వాటా విషయంలో తమ ప్రభుత్వం ఏమాత్రం రాజీపడదని... కేంద్ర ప్రభుత్వంతో పరిపాలనాపరమైన సహకారం ఉన్నప్పటికీ, రాష్ట్ర ప్రయోజనాలకు విఘాతం కలిగించే ఏ చర్యలనైనా తీవ్రంగా నిరోధిస్తామని హెచ్చరించారు. ఇదే వేదికపై స్వాతంత్ర్య సమరయోధుల సంక్షేమం కోసం పలు కీలక ప్రకటనలు చేశారు. స్వాతంత్ర్య సమరయోధులకు ఇచ్చే పింఛనును రూ. 23 వేలకు పెంచుతున్నట్టు ప్రకటించారు. అలాగే వీరపాండ్య కట్టబొమ్మన్, వి.ఓ. చిదంబరం పిళ్లై వంటి వీరుల వారసులకు ప్రత్యేక నిధులను ప్రకటిస్తూ, రాబోయే రోజుల్లో సుపరిపాలనతో తమిళనాడును సరికొత్త శిఖరాలకు తీసుకెళ్తామని తెలిపారు.

# సంస్కరణలు మరింత వేగం

(మొదటిపేజీ తరువాయి)

అనిశ్చితి వంటి అనేక సవాళ్లు ఎదురైనా భారత్ తన అభివృద్ధి ప్రయాణాన్ని కొనసాగించిందని మోడీ తెలిపారు. ఒకప్పుడు 'ఫ్రాజైల్ ఫైవ్' దేశాల్లో ఒకటిగా ఉన్న భారత్ ఇప్పుడు ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందని అన్నారు. ?డీలిమిటేషన్‌తో లింకున్న మహిళా రిజర్వేషన్ బిల్లును పాస్ చేసేలా మద్దతు ఇవ్వాలనీ, ఆ తరువాత ఆ అంశంలో క్రెడిట్ తీసుకోవాలని ప్రతిపక్షాలను ప్రధాని మోడీ కోరారు. రాజ్యాంగ సవరణకు ఆమోదం తెలిపి, రాజకీయ పార్టీలు దానికి క్రెడిట్ తీసుకోవచ్చు అన్నారు. అసెంబ్లీలు, లోక్‌సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు. మహిళా రిజర్వేషన్ బిల్లును అమలు చేసి మహిళలను గౌరవించాలన్నారు.

**కోటి మంది యువతకు ఏఐ స్కిల్స్**

వికసిత్ భారత్ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాల్సి ఉందని ప్రధాని మోడీ అన్నారు. దేశ అభివృద్ధికి యువతే అతిపెద్ద లబ్ధిదారులుగా నిలుస్తారని వివరించారు. వికసిత్ భారత్ కోసం సప్తధార ప్రణాళికను ప్రధాని మోడీ ప్రకటించారు. స్టార్టప్‌లు, ఆవిష్కరణలు, సాంకేతిక రంగాల్లో యువతకు మరిన్ని అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. "భారత్‌లో ప్రస్తుతం సుమారు రెండున్నర లక్షల స్టార్టప్‌లు ఉన్నాయి. ఇటీవల తమ ప్రభుత్వం ఏఐ ఇంపాక్ట్ సదస్సును నిర్వహించింది. ఏఐ పరిధి చాలా త్వరగా విస్తరిస్తోంది. ఎర్రకోట నుంచి దేశ యువతకు ఓ ప్రకటన చేస్తున్నాను. రాబోయే సంవత్సర కాలంలో దేశంలోని కోటి మంది యువతకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో నైపుణ్యాన్ని నేర్పించనున్నాం. ఏఐ ప్రపంచంలో ఆ యువతను బలోపేతం చేయనున్నాం. సప్త ధార విజన్‌లో భాగంగా టెక్నాలజీ, ఇన్నోవేషన్‌ను మూడో శక్తిగా పరిగణిస్తున్నాం. ఏఐ, క్వాంటమ్ టెక్నాలజీ, స్పేస్, రోబోటిక్స్, డేటా సెంటర్ల రంగం వేగంగా విస్తరిస్తోంది. కొత్త అవకాశాలను అందిపుచ్చుకునేందుకు యువతకు ట్రైనింగ్ ఇవ్వనున్నాం" అని అన్నారు.

**'ఆత్మనిర్భర్ భారత్' కీలకం**

దేశం స్వయం సమృద్ధి సాధించాల్సిన అవసరం ఉందని ప్రధాని మోడీ అన్నారు. ఇతర దేశాలపై ఆధారపడకుండా సొంత సామర్థ్యాలను పెంచుకోవడం, జాతీయ ప్రయోజనాలను కాపాడుకోవడంతో 'ఆత్మనిర్భర్ భారత్' నిర్మాణం సాధ్యమవుతుందని వివరించారు. భారత్ ఇతర దేశాలపై ఆధారపడే పరిస్థితి నుంచి బయటపడాలని మోడీ స్పష్టం చేశారు. 'మేకిన్ ఇండియా', 'స్వదేశీ', 'లోకల్ ఫర్ లోకల్' కార్యక్రమాలకు ప్రజలు మరింత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థుల కోసం ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ సదుపాయాన్ని అందిస్తున్నట్లు ప్రకటించారు.

**సెమీకండక్టర్ రంగంలో స్వావలంబనకు అడుగులు**

సెమీకండక్టర్ రంగంలో స్వావలంబన సాధించేందుకు భారత్ కీలక అడుగులు వేస్తోందని ప్రధాని మోడీ చెప్పారు. ఇప్పటికే మూడు సెమీకండక్టర్ ప్లాంట్ల ఏర్పాటుకు చర్యలు ప్రారంభమయ్యాయని తెలిపారు. దేశ ఇంధన భద్రతకు అణుశక్తి కీలకమని పేర్కొన్నారు. 2047 నాటికి 100 గిగావాట్ల అణు విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని సాధించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని చెప్పారు. 2014 నుంచి దాదాపు 40 దేశాలతో భారత్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు, వాణిజ్య భాగస్వామ్యాలు కుదుర్చుకుందని తెలిపారు. ఇటీవల కుదిరిన వాణిజ్య ఒప్పందాలతో దేశీయ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు భారీ అవకాశాలు లభిస్తున్నాయని చెప్పారు. గత 12 ఏండ్లలో రక్షణ ఉత్పత్తి దాదాపు నాలుగు రెట్లు పెరిగిందని, ఖాదీ, గ్రామీణ పరిశ్రమల ఉత్పత్తి దాదాపు ఐదు రెట్లు పెరిగిందని తెలిపారు. ఎలక్ట్రానిక్స్ తయారీ రంగంలోనూ భారీ వృద్ధి సాధించామని చెప్పారు.

**రైతులపై ఎరువుల ధరల ప్రభావం లేకుండా చర్యలు తీసుకున్నాం**

ప్రపంచవ్యాప్తంగా ఎరువుల ధరలు పెరిగినప్పటికీ భారత రైతులపై ఆ ప్రభావం పడకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుందని అన్నారు. 12 ఏండ్ల క్రితం కేవలం 70 నగరాలకే పైప్డ్ గ్యాస్ సౌకర్యం ఉండగా, ఇప్పుడు 700 నగరాలకు విస్తరించిందని మోడీ తెలిపారు. దేశవ్యాప్తంగా 1.75 కోట్ల కుటుంబాలు పైప్డ్ గ్యాస్ కనెక్షన్లతో అనుసంధానమయ్యాయని చెప్పారు.

**'దిమాగీ నక్సల్స్' ఓ కొత్త రకమైన శత్రువు**

దిమాగీ నక్సల్స్ ఓ కొత్త రకమైన శత్రువు అని మోడీ తెలిపారు. "మావోయిస్టు మైండ్‌సెట్ ఉన్న వ్యక్తులు ఇప్పుడు దేశ రాజకీయాల్లో భాగస్వామ్యం అవుతున్నారు. కొందరు ప్రభుత్వ కమిటీల్లోనూ అడ్వైజర్‌లగా విధులు నిర్వర్తిస్తున్నారు. మావోయిస్టు ఐడియాలజీ దేశ విధానాలపై ప్రభావం చూపింది. దట్టమైన అడవుల్లో ఉండే మావోయిస్టులను అంతం చేశాం. ఆ సంక్షోభం నుంచి దేశాన్ని రక్షించాం. సాయుధ మావోయిస్టులు అంతమైనా.. 'దిమాగీ నక్సల్స్' మాత్రం అలాగే ఉన్నారు" అని ప్రధాని అన్నారు. 'ఆ నక్సల్స్' దేశంలో హింస, అల్లర్లు సృష్టిస్తున్నారని మోడీ ఆరోపించారు.

## నీటి హక్కుల విషయంలో

# రాజీపడేదే లేదు

(మొదటిపేజీ తరువాయి)



దేశంలోనే రాష్ట్రం నెంబర్ వన్ గా నిలిచిందంటూ హర్షం వ్యక్తం చేశారు. గత యాసంగిలో 81.12 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్టు చెప్పారు.

**విద్యాసూచీలో 18వ స్థానం**

విద్యారంగంలో తమ ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలు స్పష్టమైన ఫలితాలనిచ్చాయని సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పర్ఫార్మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్ లో తెలంగాణ 28వ స్థానం నుంచి 18వ స్థానానికి చేరిందని గుర్తుచేశారు. రాష్ట్రంలో వందకుపైగా తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల నిర్మాణమే లక్ష్యమని చెప్పారు. వీటిలో ఇప్పటికే 105 స్కూళ్లను మంజూరు చేశామనీ, 84 బడులకు అనుమతులిచ్చామని వివరించారు. ప్రతీ నియోజకవర్గంలో ఒక యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ను నిర్మిస్తున్నట్టు తెలిపారు. ప్రీ ప్రైమరీ తరగతులను ప్రారంభించామనీ, డైట్ చార్జీలను 40 శాతం, కాస్మోటిక్ చార్జీలను 212 శాతం పెంచామని గుర్తు చేశారు. దాదాపు 22 లక్షల మంది పిల్లలకు అల్పాహారం, పాలు, పోషకాహారం అందిస్తున్నట్టు తెలిపారు. జూనియర్ కాలేజీల్లో సైతం మధ్యాహ్న భోజనం అమలు చేస్తున్నట్టు వివరించారు. 11 లక్షల మంది విద్యార్థులకు ఫీజు రీయింబర్స్ మెంట్ ను వారి ఖాతాల్లోనే నేరుగా జమ చేసే విధానాన్ని అమల్లోకి తెచ్చామని చెప్పారు.

**ఆ మాణిక్యాల కోసం సీఎం కప్**

గ్రామీణ క్రీడాకారుల్లోని ప్రతిభను ప్రపంచస్థాయికి తీసుకెళ్లే క్రీడా విధానాన్ని అమలు చేస్తున్నామని సీఎం ఈ సందర్భంగా తెలిపారు. యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీతోపాటు గచ్చిబౌలిలో స్పోర్ట్స్ డిస్ట్రిక్ట్ ను ఏర్పాటు చేశామని అన్నారు. మట్టిలోని మాణిక్యాలను వెలికి తీసేందుకే సీఎం కప్ ను నిర్వహించినట్టు వివరించారు. త్వరలో తెలంగాణ వేదికగా 'ఖేలో ఇండియా యూత్ గేమ్స్ - 2026'ను నిర్వహించబోతున్నట్టు సీఎం ప్రకటించారు. యువతకు విద్యతో పాటు నైపుణ్య కోర్సుల్లో శిక్షణను అందిస్తూ ఉద్యోగవకాశాలను పెంచామని అన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో ఇప్పటికే 72 వేల ఉద్యోగాలను భర్తీ చేశామనీ, టీజీపీఎస్సీ ద్వారా 456, పోలీస్ రిక్రూట్ మెంట్ బోర్డు ద్వారా 7,435 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు ఇచ్చామని తెలిపారు. నోటిఫికేషన్లు ఇచ్చే బాధ్యత తమదనీ, చదువుకుని ఉద్యోగాలు దక్కించుకోవాల్సిన బాధ్యత యువతదని సూచించారు. ఇతర వ్యాపకాల వైపు మళ్లకుండా పరీక్షలకు సిద్ధపడాలని విద్యార్థులను కోరారు.

**వెల్లువలా పెట్టుబడులు... ?**

టీజీఐపాస్ ద్వారా ఇప్పటికే రూ.1.29 లక్షల పెట్టుబడులు సాధించామనీ, వీటితో 78 వేలకు పైగా ఉద్యోగవకాశాలు రాబోతున్నాయని సీఎం తెలిపారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ -2025లో రూ.5.75 లక్షల కోట్ల పెట్టుబడులకు ఎంవోయూలు కుదిరినట్టు చెప్పారు. 2025-26లో ఐటీ ఎగుమతులు రూ.3.97 లక్షల కోట్లకు చేరాయనీ, ప్రత్యక్ష ఐటీ ఉద్యోగాలు 12.14 లక్షలకు పెరిగాయని తెలిపారు. హైదరాబాద్ లో ఇప్పటికే 355కు పైగా గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లు ఉన్నాయనీ, 2026లో కొత్తగా 40 సెంటర్లు వచ్చాయని తెలిపారు. దీంతో రాష్ట్రం పెట్టుబడులకు చిరునామాగా మారుతున్నదని సీఎం హర్షం వ్యక్తం చేశారు.

**2034 నాటికి కోటి మంది మహిళలు కోటీశ్వరులు**

2034 నాటికి కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంతో తమ ప్రభుత్వం పని చేస్తున్నదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఆ దిశగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహ జ్యోతి, రూ.500కే గ్యాస్ సిలిండర్, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ తదితర పథకాలు, ఆర్థిక సాయాల కోసం వేల కోట్ల రూపాయలను ఖర్చు చేసినట్టు తెలిపారు. స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ ద్వారా రూ.60,487 కోట్ల రుణాలను అందించామన్నారు. వడ్డీ లేని రుణాల కింద రూ.1,900 కోట్ల రాయితీని విడుదల చేసినట్టు తెలిపారు. మహిళలను పెట్రోల్ బంకులు, సోలార్ విద్యుత్ ప్లాంట్లు, ఆర్టీసీ బస్సులకు యజమానులుగా మార్చామన్నారు.

**సామాజిక భద్రతకు పెద్దపీట**

తమ ప్రభుత్వం సామాజిక భద్రతకు పెద్దపీట వేస్తోందని సీఎం తెలిపారు. రాష్ట్రంలో 3.38 కోట్ల మందికి సన్న బియ్యం అందిస్తున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. తొలి దశలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తున్నామని అన్నారు. రెండో దశలో 2.50 లక్షల కొత్త ఇండ్ల మంజూరుతోపాటు క్యూర్ పరిధిలో లక్ష ఇండ్లను నిర్మిస్తున్నట్టు తెలిపారు. అర్హులైన వారికి కొత్తగా ఫించన్లకు మంజూరు హామీనిచ్చారు. ఎస్సీ వర్గీకరణతో పాటు బీసీలకు విద్య, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్ల కోసం అసెంబ్లీలో బిల్లును ఆమోదించామని, మొత్తం వ్యయంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమానికి 12.4 శాతం కేటాయించామని తెలిపారు.

**కనీస వేతనాల సవరణ**

పన్నెండేండ్ల నుంచి పెండింగ్ లో ఉన్న కనీస వేతనాలను తమ ప్రభుత్వం సవరించిందని సీఎం వివరించారు. గిగ్ వర్కర్ల సంక్షేమం కోసం చట్టం తెచ్చామనీ, అదే విధంగా సినీ కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని తెలిపారు. వయస్సు మళ్లిన తల్లిదండ్రుల విషయంలో ఉద్యోగులైన పిల్లల బాధ్యతను గుర్తుచేసేలా చట్టం చేశామని అన్నారు. రోహిత్ వేముల చట్టానికి రూపకల్పన చేస్తున్నట్టు చెప్పారు.

**టీజీ సేఫ్ తో కల్తీ నియంత్రణ**

డ్రగ్స్ ముప్పుతో పాటు ఆహారకల్తీని పూర్తిగా నియంత్రించేందుకు టీజీసేఫ్ వ్యవస్థను ఏర్పాటు చేస్తామని సీఎం తెలిపారు. కల్తీ నియంత్రణకు కఠిన చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచడంతో పాటు ఉస్మానియా ఆస్పత్రి, వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, మూడు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులకు నూతన భవనాలను నిర్మిస్తున్నామని తెలిపారు. ఎనిమిది మెడికల్ కాలేజీలకు కొత్త భవనాలను నిర్మించేందుకు నిర్ణయించామని వివరించారు. సీఎం సహాయనిధి కింద నిరుపేద రోగులకు రూ.2,526 కోట్లు అందించినట్టు తెలిపారు.

కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులతో సహా ఉద్యోగులందరికి ప్రతీ నెలా మొదటి తేదీన జీతాలు అందేలా చర్యలు తీసుకున్నామని సీఎం గుర్తు చేశారు. రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలను ప్రాధాన్యతా క్రమంలో చెల్లిస్తున్నామనీ, ఇచ్చిన హామీ మేరకు ఇప్పటికే రూ.6 వేల కోట్లను విడుదల చేశామని తెలిపారు. డిజిటల్ పాలనలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. పారదర్శకమైన పాలన అందించడంలో భాగంగా త్వరలోనే ఆన్ లైన్ ప్రజావాణి పోర్టల్ ను ప్రారంభిస్తున్నామని వెల్లడించారు. మౌలిక వసతుల కల్పనలో భాగంగా 360 కిలోమీటర్ల ట్రిబుల్ ఆర్ నిర్మాణంతో పాటు 6,092 కిలోమీటర్ల హ్యామ్, రేడియల్ రోడ్లు, హైదరాబాద్ మెట్రో రెండో దశను ముందుకు తీసుకెళ్తున్నట్టు తెలిపారు. మామునూరు విమానాశ్రయ పునరుద్ధరణతోపాటు ఆదిలాబాద్ జాయింట్ యూజ్ ఎయిర్ ఫీల్డ్‌ను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. రోడ్, రైల్, విమాన, లాజిస్టిక్స్ కనెక్టివిటీ విస్తరించే దిశగా ముందుకెళ్తున్నట్టు తెలిపారు.

**సహకరించండి..నష్టపోనివ్వను...**

రాష్ట్ర అభివృద్ధి కోసం సహకరించే వారు ఏ మాత్రం నష్టపోకుండా చూస్తానని సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. మూసీ ప్రక్షాళనతో పాటు భారత్ ఫ్యూచర్ సిటీ కోసం తమ భూములు ఇచ్చేందుకు ముందుకొచ్చే నివాసితులు నష్టపోకుండా చూస్తానని భరోసానిచ్చారు. ఇందుకోసం మూసీ పరీవాహక ప్రాంతంలో ఉన్నవారు పెద్ద మనసుతో ముందుకు రావాలని ఆయన కోరారు. దేశ జీడీపీలో రాష్ట్రవాటాను 10 శాతానికి పెంచడమే లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు. గత రెండున్నరేండ్లలో ప్రజల భాగస్వామ్యంతో విజయాలు సాధించామని చెప్పారు. అందరి సహకారంతో రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి చేసుకుందామని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. మానవ ప్రయత్నానికి దైవ సంకల్పం తోడైతే తప్పకుండా విజయం సాధిస్తామని ఆయన వ్యాఖ్యానించారు.

# వైసీపీని ఇరుకున పడేస్తున్న కోర్టు తీర్పు

**విజయవాడ- సూర్య వాస్తవం**



కూటమి ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీ పరీక్షల్లో అక్రమాలు, పేపర్ లీక్ జరిగింది అంటూ వైఎస్ ఆర్‌సీపీ గత కొంతకాలంగా ఉద్యమం చేస్తోంది. అయితే, ఈ ఆరోపణలకు తగిన ఆధారాలు చూపించడంలో వైఎస్ఆర్‌సీపీ ఘోరంగా విఫలమవడంతో ఆ నిరసనలకు పొలిటికల్ మైలేజ్ దక్కలేదన్న అభిప్రాయం వినిపిస్తోంది. కానీ, అదే సమయంలో గత వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన గ్రూప్-1 మూల్యాంకనంలో ఘోరమైన అక్రమాలు జరిగాయని ప్రత్యేక దర్యాప్తు బృందం హైకోర్టుకు నివేదిక సమర్పించడం ఏపీ రాజకీయాల్లో మైండ్ గేమ్ మార్చేసింది. డీఎస్సీపై ఎలాంటి క్లూస్ ఇవ్వలేకపోయిన వైఎస్ఆర్‌సీపీకి, గ్రూప్-1 కేసు రూపంలో కూటమి ప్రభుత్వానికి అత్యంత పవర్ ఫుల్ ఆయుధం దొరికినట్లయింది. సిట్ దాఖలు చేసిన తాజా నివేదిక ఆధారంగా పరిశీలిస్తే.. వైఎస్ఆర్‌సీపీ హయాంలో నిర్వహించిన గ్రూప్-1 పరీక్షల్లో వ్యవస్థాగతంగా తీవ్రమైన అవకతవకలు జరిగాయని పక్కా నిరూపణలతో సహా బయటపడింది. డిజిటల్ మూల్యాంకనం రద్దు కావడం, హాయ్‌లాండ్ రిసార్ట్‌కు నిబంధనలకు విరుద్ధంగా జవాబు పత్రాలు తరలించడం, ఓఎంఆర్ వాల్యుయేషన్ స్లిప్పులపై సరిదిద్దడం వరకు చోటుచేసుకున్న తీరు షాకింగ్‌గా ఉంది. ల్యాబ్ ఫోరెన్సిక్ రిపోర్టుల ప్రకారం తనిఖీ చేసిన 736 వాల్యుయేషన్ రికార్డుల్లో ఏకంగా 718 రికార్డులలోఅంటే 97.55 శాతం దిద్దుబాట్లు, ఓవర్ రైటింగ్‌లు జరిగాయని తేలడం నాటి వ్యవహారం ఎంత దారుణంగా సాగిందో తెలియజేస్తోంది. ఈ మొత్తం వ్యవహారంలో నాటి ఏపీపీఎస్సీ కార్యదర్శి, సీనియర్ ఐపీఎస్ అధికారి పి.ఎస్.ఆర్. ఆంజనేయులు పేరు ప్రధానంగా వినిపిస్తోంది. ఏపీపీఎస్సీ ఛైర్మన్ అనుమతి లేకుండానే జవాబు పత్రాలను హాయ్‌లాండ్ రిసార్ట్‌కు తరలించి, 84 రోజుల పాటు ప్రైవేట్ ఏజెన్సీ క్యామ్‌సైన్ మీడియా కస్టడీలో ఉంచడం వెనుక ఆయనే కీలక పాత్ర పోషించారని సిట్ గుర్తించింది. దాదాపు రూ.1.14 కోట్ల ప్రజాధనాన్ని సదరు ఏజెన్సీకి అప్పగించి, కేవలం ముందస్తు డిజిటల్ మార్కులను మళ్లీ నాఓఖీ రికార్డుల్లో ఎంట్రీ చేయించేలా డేటా ఎంట్రీ ఆపరేటర్లకు శిక్షణ ఇప్పించారనే ఆరోపణలు నాడు ఐపీఎస్ అధికారి హోదాలో ఆయన నడిపిన నెట్‌వర్క్‌ను ఎండగడుతున్నాయి. హైకోర్టు ఆదేశాల ప్రకారం మ్యాన్యువల్ వాల్యుయేషన్ చేయాలని చెప్తూనే.. నిబంధనలకు విరుద్ధంగా వైట్‌నర్ వాడటం, సీనియర్ ఎగ్జామినర్ల సంతకాలు లేకపోవడం, కొత్త సంతకాలు కలవకపోవడం, 197 మందికి మార్కులు పెంచి, 222 మందికి మార్కులు తగ్గించడం వెనుక పెద్ద ఎత్తున పొలిటికల్ అండ్ ఫైనాన్షియల్ డీలింగ్స్ ఉన్నట్లు అనుమానాలు బలపడుతున్నాయి. సీఎస్ ఆప్షన్ లేని చోట నాటి వైఎస్ఆర్‌సీపీ పెద్దల ఓరల్ ఇన్‌స్ట్రక్షన్స్ ఆధారంగానే మార్కులు మార్చారని సిట్ రిపోర్ట్ తేల్చిచెప్పడం గేమ్ ఛేంజర్‌గా మారుతోంది. ప్రస్తుతం సర్వీసులో ఉన్న గ్రూప్-1 అధికారులను గనుక సిట్ లోతుగా ప్రశ్నిస్తే మరింత సంచలన విషయాలు బయటకు రావడం ఖాయం. నాటి మూల్యాంకనంలో అసలైన మెరిట్ అభ్యర్థులకు అన్యాయం చేసి, ఎవరెవరికి మార్కులు పెంచి కొలువులు కట్టబెట్టారో లబ్ధిదారులైన అధికారుల మూలాల నుంచి వెలికితీసేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమవుతోంది. డీఎస్సీ పరీక్షలపై ఆధారాలు లేని ఆరోపణలతో ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టాలని చూసిన వైఎస్ఆర్‌సీపీ.. ఇప్పుడు గ్రూప్-1 సిట్ నివేదికతో తామే ఇరుక్కుపోయిన పరిస్థితి నెలకొంది. ఎన్నికల ముందే నిరుద్యోగ ఓట్ బ్యాంకును ఆకట్టుకోవడానికి వైఎస్ఆర్‌సీపీ ప్రయత్నించగా, ఇప్పుడు కూటమి ప్రభుత్వం నాటి గ్రూప్-1 స్కామ్‌ను ఎండగడుతూ రివర్స్ కౌంటర్ ఇస్తోంది. ఆధారాలతో సహా ఫోరెన్సిక్ రిపోర్టులు కోర్టుకు చేరడంతో, పిఎస్ఆర్ ఆంజనేయులు సహా ఈ కుంభకోణంలో ప్రమేయమున్న కీలక సూత్రధారులపై చట్టపరమైన ఉచ్చు బిగుసుకోవడం ఖాయంగా కనిపిస్తోంది.

# తెరపైకి క్రెడిట్ వార్

**ఏలూరు - సూర్య వాస్తవం**

ఆంధ్రప్రదేశ్ రాజకీయంలో ప్రతిష్టాత్మక పోలవరం ప్రాజెక్టు మళ్లీ వార్తలకె?క్కింది. కేంద్ర ప్రభుత్వం పోలవరం ఫేజ్-1 నిర్మాణ సవరించిన అంచనా వ్యయానికి రూ.30,436.95 కోట్లు ఆమోదించడం, దాదాపు రూ.12,157 కోట్లకు పైగా బ్యాలెన్స్ గ్రాంట్‌ను ఖరారు చేయడంతో రాష్ట్రంలో క్రెడిట్ గేమ్ జోరందుకుంది. కేంద్రంలో పట్టుబట్టి, ఎన్డీయే భాగస్వామిగా ఒత్తిడి తెచ్చి పోలవరానికి రూ.12,000 కోట్లకు పైగా ప్రత్యేక నిధులు తీసుకువచ్చామని, ప్రాజెక్టును మళ్లీ పట్టాలెక్కించామని అధికార కూటమి ప్రచారం చేసుకుంటోంది. మరోవైపు, తమ హయాంలోనే ఫేజ్-1 ప్రతిపాదనలను కేంద్రానికి సమర్పించి, 41.15 మీటర్ల పరిమితికి అనుగుణంగా సాంకేతిక అనుమతులు సాధించామని, ఆ కష్టఫలమే నేడు కేంద్రం ఇచ్చిన ఆమోదమని వైఎస్ఆర్‌సీపీ తమ ఖాతాలో వేసుకునే యత్నం చేస్తోంది. ఈ పొలిటికల్ డిబేట్‌లో ఇరుపక్షాలు విసురుకుంటున్న ఆరోపణలు, ప్రత్యారోపణలు క్షేత్రస్థాయి వాస్తవాలను దాచిపెడుతున్నాయి. 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వం 70 శాతానికి పైగా పనులు పూర్తి చేసిందని, డయాఫ్రమ్ వాల్‌తో సహా ప్రధాన నిర్మాణాలను వేగవంతం చేసిందని టీడీపీ శ్రేణులు చెప్తున్నాయి. కానీ, 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్ఆర్‌సీపీ రివర్స్ టెండరింగ్ పేరుతో ఏజెన్సీని మార్చడం వల్ల ప్రాజెక్టు ఆలస్యమైందని, 2020 గోదావరి వరదల్లో డయాఫ్రమ్ వాల్ దెబ్బతినడానికి జగన్ సర్కార్ అజ్ఞానమే కారణమని టీడీపీ తీవ్రంగా కౌంటర్ ఇస్తోంది. దానికి పోటీగా, పోలవరం కాంట్రాక్టులను నాటి టీడీపీ ప్రభుత్వం తమ అనుకూల ఏజెన్సీలకు కట్టబెట్టి అంచనాలు పెంచేసిందని, తాము వచ్చి అవినీతిని అరికట్టి నిధులను సద్వినియోగం చేశామని వైఎస్ఆర్‌సీపీ కౌంటర్ ఇస్తోంది. ఈ క్రెడిట్ గేమ్ లో పొలిటికల్ లీడర్లు ఎవరు పైచేయి సాధించినా.. ప్రజా క్షేత్రంలో మాత్రం అసలైన విజేత ప్రాజెక్టు పూర్తయినప్పుడే తేలుతుంది. కేవలం మాటల విన్యాసాల వల్ల ఓటర్లు ఓట్లేయరనేది గత అనుభవాలు నిరూపించాయి. జగన్ హయాంలో రివర్స్ టెండరింగ్ వల్ల ప్రాజెక్టు ఐదేళ్లు వెనక్కి వెళ్లడమే కాకుండా, రూ.15,000 కోట్ల మేర ఆర్థిక నష్టం జరిగిందనే ప్రచారం ప్రజల్లోకి బలంగా వెళ్లింది. అందుకే, ఇప్పుడు మళ్లీ అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం క్రెడిట్ దక్కించుకోవాలంటే కేవలం వైఎస్ఆర్‌సీపీపై నిందలు వేస్తే సరిపోదు; అనుకున్న గడువులోగా గ్రావిటీ ద్వారా నీళ్లను అందించాల్సి ఉంటుంది. కేంద్ర జలశక్తి శాఖ రాజ్యసభ వేదికగా స్పష్టం చేసిన వివరాల ప్రకారం, ప్రస్తుతం పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే కాంక్రీట్ పనులు 98.84%, ప్రధాన కాలువల తవ్వకం 98.96% వరకు పూర్తయ్యాయి. అయితే, దెబ్బతిన్న డయాఫ్రమ్ వాల్ స్థానంలో కొత్త డయాఫ్రమ్ వాల్ నిర్మాణం, ఎర్త్-కమ్-రాక్‌ఫిల్ డ్యామ్ నిర్మాణం పూర్తికావడం అత్యంత కీలకమైన సవాలు. కేంద్ర జలశక్తి శాఖ అంచనాల ప్రకారం తొలి దశ 41.15 మీటర్ల నీటి మట్టం పనులను అక్టోబర్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అవసరమైతే మరొక ఏడాది కాలపరిమితి పెరిగినా.. 2027 నాటికి తొలి దశ నీటిని నిల్వ చేసి, కాలువల ద్వారా నీటిని విడుదల చేసే అవకాశం కనిపిస్తోంది. పోలవరం కేవలం కాంక్రీట్ నిర్మాణం మాత్రమే కాదు, అది వేలాది మంది గిరిజనులు, రైతుల పునరావాస సమస్య. ఫేజ్-1 లో దాదాపు 96,660 నిర్వాసిత కుటుంబాలు ఉండగా, ఇప్పటివరకు కేవలం 17,892 కుటుంబాలకు మాత్రమే పునరావాసం కల్పించారు. నీరు నిల్వ చేయాలంటే మిగిలిన వేలాది కుటుంబాలకు ఆర్‌అండ్ఆర్ ప్యాకేజీలు ఇచ్చి ఖాళీ చేయించాలి. కాబట్టి, డ్యామ్ నిర్మాణం 2026-27 నాటికి పూర్తయినా, నిర్వాసితులకు పరిహారం చెల్లించి, నిధుల సమస్య లేకుండా పునరావాసం పూర్తి చేస్తేనే రైతులకు పూర్తిస్థాయిలో నీటి ఫలాలు అందుతాయి. రాజకీయం పక్కనపెట్టి, కేంద్రం ఇచ్చిన నిధులతో యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయడమే ఏపీ భవిష్యత్తుకు శ్రీరామరక్ష



- మైనర్లతో పాటు యువకులపై పోలీసుల కొరడా.. తల్లిదండ్రులకు కౌన్సెలింగ్...
- బైపాస్‌పై రేసింగ్, ప్రమాదకర స్టంట్లతో వాహనదారులకు దడ..
- రేసింగ్, ప్రమాదకర డ్రైవింగ్‌కు పాల్పడితే కేసులు...
- తల్లిదండ్రులు, వాహన యజమానులపైనా చర్యలు..
- అనుమతి లేకుండా పబ్లిక్ రోడ్డుపై రేసింగ్ చేస్తే జరిమానా, జైలు శిక్షకు అవకాశం...
- మైనర్లు బైక్‌లు నడిపితే కఠిన చర్యలు...!

# హైవేపై స్టంట్లకు చెక్..!

## 15 ద్విచక్ర వాహనాలు సీజ్...!

**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం**

పాముదాయి-తాడిపత్రి 544డీ హైవేపై ప్రమాదకరంగా ద్విచక్ర వాహనాలతో రైడింగ్, స్టంట్లు చేస్తున్న యువతపై బుక్కరాయసముద్రం పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. సీఐ సుబ్బరాయుడు ఆధ్వర్యంలో చేపట్టిన తనిఖీల్లో మైనర్లతో పాటు పలువురు యువకులు వేగంగా వాహనాలు నడుపుతూ ప్రమాదకర స్టంట్లు చేస్తున్నట్లు గుర్తించారు. దీంతో 15 ద్విచక్ర వాహనాలను పోలీసులు సీజ్ చేశారు. సీజ్ చేసిన వాహనాలతో పాటు వాటిని నడిపిన యువతను పోలీస్‌స్టేషన్‌కు తరలించి, వారి తల్లిదండ్రులను పిలిపించారు. ప్రమాదకర రైడింగ్ వల్ల వాహనాలు నడిపే వారి ప్రాణాలకే కాకుండా హైవేపై ప్రయాణించే ఇతర వాహనదారుల భద్రతకు కూడా ముప్పు ఏర్పడుతుందని పోలీసులు తల్లి దండ్రులకు వివరించారు. ముఖ్యంగా మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇవ్వకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.



**నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు**

వాహనాల రికార్డులను పరిశీలించిన పోలీసులు నిబంధనలు ఉల్లంఘించిన వారిపై జరిమానాలు విధించారు. అనంతరం సీఐ సుబ్బరాయుడు, ఎస్ఐ గోవిందు, పోలీసు సిబ్బంది యువతకు కౌన్సెలింగ్ నిర్వహించారు. రోడ్లపై స్టంట్లు చేయడం సరదా కాదని, చిన్నపాటి నిర్లక్ష్యం కూడా ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని హెచ్చరించారు.

**బైపాస్‌పై రేసింగ్‌తో స్థానికుల ఆందోళన**

పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటున్నప్పటికీ కొందరు ఆకతాయిల తీరు మారడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బైక్, బుల్లెట్ వాహనాలతో యువకులు తామే హీరోలమన్నట్లుగా రోడ్డుపై దూసుకెళ్తున్నారని చెబుతున్నారు. ముఖ్యంగా పట్టణ శివారు బైపాస్ ప్రాంతం బైక్ రేసింగ్‌కు అడ్డాగా మారుతోందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రయ్యిమంటూ వేగంగా దూసుకెళ్లడం, ప్రమాదకర విన్యాసాలు చేయడం వల్ల సాధారణ వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారని స్థానికులు చెబుతున్నారు. గతంలో శివారు ప్రాంతాలకే పరిమితమైన బైక్ రేసింగ్ తరహా చర్యలు ప్రస్తుతం ప్రధాన రహదారులపైకి రావడంతో ప్రమాదాల ముప్పు పెరుగుతోందని వారు పేర్కొంటున్నారు.

**ప్రత్యేక నిఘా కొనసాగుతుంది**

హైవేలు, బైపాస్ రహదారులపై ప్రమాదకర రైడింగ్, ర్యాష్ డ్రైవింగ్, మైనర్లు వాహనాలు నడపడం వంటి ఉల్లంఘనలపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని పోలీసులు తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే వాహనాల సీజ్‌తో పాటు చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. యువత బాధ్యతగా వ్యవహరించి తమతో పాటు ఇతరుల భద్రతను కూడా దృష్టిలో ఉంచుకోవాలని సూచించారు.

**మైనర్లు బైక్‌లు నడిపితే కఠిన చర్యలు...!**

మైనర్లు ద్విచక్ర వాహనాలు నడపడం, పబ్లిక్ రోడ్లపై రేసింగ్ లేదా ప్రమాదకరంగా వాహనాలు నడపడం చట్టవిరుద్ధం. మోటారు వాహనాల చట్టం ప్రకారం మైనర్ డ్రైవింగ్‌కు పాల్పడితే సంబంధిత నిబంధనల కింద చర్యలు తీసుకునే అవకాశం ఉంది. మైనర్‌కు వాహనం నడపడానికి అనుమతించిన తల్లిదండ్రులు లేదా వాహన యజమానిపైనా చర్యలు తీసుకోవచ్చు. అలాగే పబ్లిక్ రోడ్డుపై అనుమతి లేకుండా రేసింగ్, స్పీడ్ ట్రయల్స్‌లో పాల్గొంటే మోటారు వాహనాల చట్టంలోని సెక్షన్ 189 ప్రకారం శిక్షలు వర్తించవచ్చు. మైనర్ వాహనం నడుపుతూ ప్రమాదకరంగా రేసింగ్ చేయడం వల్ల తనతో పాటు ఇతరుల ప్రాణాలకు కూడా ముప్పు ఏర్పడే అవకాశం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు. యువత రోడ్లపై స్టంట్లు, రేసింగ్‌లకు దూరంగా ఉండాలని, తల్లిదండ్రులు తమ పిల్లలకు వాహనాలు ఇవ్వకుండా బాధ్యతగా వ్యవహరించాలని సూచిస్తున్నారు. తల్లిదండ్రులకు సూర్య వాస్తవం ద్వారా ఒక చిన్న విన్నపం 18 సంవత్సరాల లోపు యువకులకు బైకులు ఇచ్చి వాళ్ళ భవిష్యత్తును నాశనం చేయకండి అని మనవి

# జెండా, అజెండా భారత్...

**విజయవాడ - సూర్య వాస్తవం**



ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రజలకు, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగువారందరికీ 80వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన సోషల్ మీడియా వేదికగా భావోద్వేగ పోస్ట్ చేశారు. దేశ భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దడమే స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలకు ఇచ్చే నిజమైన నివాళి అని చంద్రబాబు తన పోస్ట్‌లో పేర్కొన్నారు."ఎందరో మహనీయుల త్యాగాలు, పోరాటాల ఫలితమే మన స్వాతంత్ర్యం. దేశం నాకు ఏం చేసిందని కాకుండా, దేశానికి నేను ఏం చేయగలనని ప్రతి ఒక్కరూ 'అనే నేను..' సంకల్పంతో ఆలోచించాలి" అని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరి చేతిలో జాతీయ జెండా, గుండెల్లో దేశం కోసం బలమైన అజెండా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. 2047 నాటికి 'వికసిత్ భారత్', 'స్వర్ణాంధ్ర' సాధించాలన్న లక్ష్యంలో అందరూ భాగస్వాములు కావాలని చంద్రబాబు కోరారు. 0వ స్వాతంత్ర్య దినోత్సవ వేళ ఆంధ్రప్రదేశ్ ప్రజలందరికీ, ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు వారందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు. "ఎందరో మహనీయుల త్యాగాలు, పోరాటాల ఫలితమే మన స్వాతంత్ర్యం. వారి త్యాగాలకు నిజమైన నివాళి అంటే దేశ భవిష్యత్తును మరింత గొప్పగా నిర్మించడమే. అందుకు 'అనే నేను...' సంకల్పంతో దేశం నాకు ఏం చేసిందని కాదు... దేశానికి నేను ఏం చేయగలనని అందరూ ఆలోచించాలి. మన చేతిలో జాతీయ జెండా ఉం డాలి... మన గుండెల్లో దేశం కోసం బలమైన అజెండా ఉండాలి. 2047 నాటికి వికసిత్ భారత్... స్వర్ణాంధ్ర సాకారం చేయాలన్న సమున్నత లక్ష్యంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలి. 100 ఏళ్ల స్వాతంత్ర్య వేడుకల నాటికి దేశం, రాష్ట్రం స్వాతంత్ర్యం నుంచి సమృద్ధి వైపు... వికాసం నుంచి వైభవం వైపు ముందుకుసాగాలి. ఈ సంకల్పాన్ని నెరవేర్చుకునేందుకు ఐక్యంగా కలిసి అడుగులు వేద్దాం." అని పిలుపునిచ్చారు. మన స్వాతంత్ర్య సమరయోధుల, దార్శనిక నాయకుల నుంచి శాశ్వతమైన స్ఫూర్తిని పొంది, వారి స్ఫూర్తిని దేశ నిర్మాణ కార్యంలో ముందుకు తీసుకువెళ్దాం. మన యువత స్పష్టమైన లక్ష్యంతో, నైతిక ధైర్యంతో నాయకత్వం వహించాలి. రాజకీయ విభజనలకు, సామాజిక విభేదాలకు అతీతంగా ఎదగాలి. ప్రతి పల్లెటూరు, పట్టణం, నగరంలోని ప్రతి పౌరుడు, రాబోయే తరాల కోసం బలమైన, సుసంపన్నమైన, స్వయం సమృద్ధిగల, నిజమైన వికసిత భారత్‌ను నిర్మించడానికి చిత్తశుద్ధితో తమ వంతు కృషి చేయాలి." అని రాసుకొచ్చారు. ఇది మన సమిష్టి ధర్మం అని, ఇది మన ఉమ్మడి గమ్యం అని పేర్కొన్నారు. ."100 ఏళ్ల స్వాతంత్ర్య వేడుకల నాటికి దేశం, రాష్ట్రం స్వాతంత్ర్యం నుంచి సమృద్ధి వైపు, వికాసం నుంచి వైభవం వైపు సాగాలి. ఈ సంకల్పాన్ని నెరవేర్చుకోవడానికి ఐక్యంగా అడుగులు వేద్దాం" అని ఆయన తెలిపారు. తన సందేశాన్ని 'జై తెలుగుతల్లి! జై హింద్!' నినాదాలతో ముగించారు

**పవిత్ర బాధ్యతగా భావించాలి: పవన్**

80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా, తమ ధైర్యం, త్యాగం, దేశభక్తితో మనం ఈరోజు అనుభవిస్తున్న స్వేచ్ఛను సాధించిన స్వాతంత్ర్య సమరయోధులకు హృదయపూర్వక నివాళులు అర్పించారు ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్. సోషల్ మీడియాలో ఒక పోస్టు పెట్టారు. "మనం అనుభవిస్తున్న స్వేచ్ఛ తేలికగా తీసుకోవలసిన బహుమతి కాదని, అది మన జాతీయ ఐక్యత, ప్రాదేశిక సమగ్రత, సార్వభౌమాధికారాన్ని కాపాడటానికి చేపట్టిన ఒక పవిత్ర బాధ్యత అని వారి జీవితాలు మనకు శాశ్వత స్ఫూర్తిగా నిలుస్తాయి. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి గడిచిన దశాబ్దాల్లో, దేశం నిశ్శబ్దమైన సంకల్పంతో, అద్భుతమైన ఆశయంతో ఎదిగింది. ప్రపంచ అంతరిక్ష శక్తిగా ఆవిర్భవించడం, చంద్రుని దక్షిణ ధ్రువ ప్రాంతానికి సమీపంలో చారిత్రాత్మక ల్యాండింగ్ అవ్వడం నుంచి, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలను నిర్మించడం, యూపీఐ ద్వారా డిజిటల్ ప్రజా మౌలిక సదుపాయాలను సృష్టించడం, మన రక్షణ సామర్థ్యాలను బలోపేతం చేయడం, ప్రపంచ వేదికపై ఒక ప్రధాన ఆర్థిక శక్తిగా స్థిరపడటం వరకు - ఈ విజయాలు భారత ప్రజల ప్రతిభకు, అకుంఠిత స్ఫూర్తికి సజీవ నిదర్శనం .

## నేడు అనంతపురానికి మేలుకో ఆంధ్రప్రదేశ్ కో-కన్వీనర్ కె.ఎం. అబ్దుస్ సుబహాన్ రాక

**షకీల్ షఫీకి జమాఅతే ఇస్లామీ హింద్ అనంతపురం యూనిట్ శుభాకాంక్షలు**
**"స్వాతంత్ర్య ఉద్యమంలో ముస్లింల పాత్ర" పుస్తకం బహూకరణ**



**అనంతపురం టౌన్ - సూర్య వాస్తవం :** 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ముతవల్లిల సంఘం అధ్యక్షులు జనాబ్ కె.యం. షకీల్ షఫీకి జమాఅతే ఇస్లామీ హింద్ అనంతపురం యూనిట్ తరపున శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య ఉద్యమంలో ముస్లింల పాత్రను వివరించే "స్వాతంత్ర్య ఉద్యమంలో ముస్లింల పాత్ర" పుస్తకాన్ని ఆయనకు బహూకరించారు. ఈ కార్యక్రమంలో హాజీపీరా, హసేన్, జిలానీ పాల్గొన్నారు.

**ఓటర్ లిస్ట్ అంశాలపై నేడు సమావేశం**

మేలుకో ఆంధ్రప్రదేశ్ కో-కన్వీనర్ జనాబ్ కె.ఎం. అబ్దుస్ సుబహాన్ సోమవారం అనంతపురం విచ్చేయనున్నారు. 2026 ఓటర్ లిస్ట్‌లో నోటీసులు అందుకున్న వారికి సంబంధించిన అభ్యంతరాలు, ఫ్యామిలీ సర్టిఫికెట్ల అంశంపై రాష్ట్ర ప్రభుత్వ సహకారం కోరే విషయమై రాష్ట్ర ముతవల్లిల సంఘం అధ్యక్షులు జనాబ్ కె.యం. షకీల్ షఫీతో పాటు ఉలేమాలతో సమావేశం నిర్వహించనున్నారు. సోమవారం ఉదయం 11 గంటలకు రామనగర్‌లోని క్రెసెంట్ స్కూల్ ఛాంబర్స్‌లో ఈ సమావేశం జరగనుంది. సంబంధిత అంశాలపై చర్చించి తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకోనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## 34వ సారి రక్తదానం చేసిన ఎస్ఐ శ్రీనివాసులు

- కిడ్నీ ఫెయిల్యూర్‌తో చికిత్స పొందుతున్న పెద్దన్నకు రక్తదానం
- పేద రోగికి అండగా నిలిచిన ఎస్ఐ శ్రీనివాసులు
- ఆపదలో ఉన్న రోగికి రక్తదానం చేసి ధైర్యం చెప్పిన శ్రీనివాసులు
- స్వచ్ఛంద రక్తదానంతో మానవత్వాన్ని చాటుకున్న శ్రీనివాసులు



**అనంతపురం వైద్యం - సూర్య వాస్తవం:** అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో 34వ సారి రక్తదానం చేసేందుకు వచ్చిన సబ్‌ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులకు ఆసుపత్రి సిబ్బంది సుస్వాగతం పలికి, 80వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. బి పాజిటివ్ రక్తదాత అయిన శ్రీనివాసులు ఆసుపత్రిలోని ఎంఎం వార్డుకు వెళ్లి చికిత్స పొందుతున్న పెద్దన్నను పరామర్శించి, ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. దాదులూరు గ్రామానికి చెందిన పెద్దన్న అత్యంత పేద కుటుంబానికి చెందిన వ్యక్తి అని, కిడ్నీ ఫెయిల్యూర్ కారణంగా చాలా రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారని కుటుంబ సభ్యులు తెలిపారు. శరీరంలో రక్తశాతం తగ్గడంతో పాటు జ్వరం రావడంతో అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించామని, రక్తం అందుబాటులో లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని, రక్తం కోసం సహాయం కోరామని వారు శ్రీనివాసులకు వివరించారు. విషయం తెలుసుకున్న శ్రీనివా సులు పెద్దన్నకు ధైర్యం చెప్పి, ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు. అనంతరం 34వ సారి స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ, 80వ స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా రక్తదానం చేసే అవకాశం రావడం తన అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. అత్యవసర సమయంలో రక్తం అవసరమైన వారికి ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకోవాలి

- జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన మంత్రి పయ్యావుల కేశవ్
- పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**అనంతపురం ప్రతినిధి - సూర్య వాస్తవం :** అనంతపురం నగరంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో 80వ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జాతీయ గీతాన్ని ఆలపించి, పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి పయ్యావుల కేశవ్ దేశ ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుల త్యాగాలను స్మరించుకోవాలని అన్నారు. వారి స్ఫూర్తితో రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్, జిల్లా ఎస్పీ ఎం. జగదీష్, జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఎమ్మెల్సీ మంగమ్మతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, పోలీసు అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.



# వికసిత్ భారత్ లక్ష్యంగా దేశం.. వికసిత్ ఆంధ్రప్రదేశ్ దిశగా రాష్ట్రం...!

- 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్
- త్యాగధనుల పోరాట ఫలితమే మన స్వాతంత్ర్యమన్న ఎమ్మెల్యే దగ్గుబాటి
- రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దుతాం



**అనంతపురం ప్రతినిధి - సూర్య వాస్తవం :** 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని దేశం వికసిత్ భారత్ లక్ష్యంగా ముందుకు సాగుతోందని అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. వికసిత్ ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకెళ్తోందని పేర్కొన్నారు. అనంతపురం అర్బన్ టీడీపీ కార్యాలయం, మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పోలీస్ పరేడ్ మైదానంలో జరిగిన అధికారిక వేడుకలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంతో మంది స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల ఫలితంగానే మనకు స్వాతంత్ర్యం లభించిందన్నారు. వారి త్యాగాలను స్మరించుకుంటూ దేశాభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. త్రివర్ణ పతాకం దేశవ్యాప్తంగా గర్వంగా రెపరెపలాడుతోందని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్‌ను ప్రపంచంలోనే అగ్రస్థానంలో నిలిపే దిశగా కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రాష్ట్రంలో గత రెండేళ్లుగా సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతమయ్యాయని చెప్పారు. రాష్ట్రానికి ఒకే రాజధాని ఉండాలనే లక్ష్యంతో అమరావతినే రాజధానిగా కొనసాగించేలా చట్టం చేశామని ఎమ్మెల్యే తెలిపారు. గోదావరి పుష్కరాల నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు తీసుకురావడంతో పాటు రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. గత ఏడాది ఆగస్టు 15న ప్రారంభించిన 'స్త్రీ శక్తి' పథకం ద్వారా జిల్లాలోని 322 బస్సుల్లో ఇప్పటివరకు 2.80 కోట్ల ఉచిత ప్రయాణాలు జరిగాయని, ఇందుకోసం రూ.132 కోట్లను ఖర్చు చేసినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో ఇప్పటికే రూ.200 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. రానున్న రెండేళ్లలో రూ.100 కోట్లతో డ్రైనేజీలు, రూ.160 కోట్లతో రోడ్ల నిర్మాణం చేపడతామని చెప్పారు. రూ.78 కోట్లతో నడిమివంక, మరువవంక సైడ్‌వాల్స్ నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ప్రజలందరి సహకారంతో రానున్న రోజుల్లో అనంతపురం అర్బన్ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పేర్కొన్నారు.



## స్వచ్ఛత యోధులను గౌరవించడం అభినందనీయం డిస్కవర్ అనిల్ కుమార్

- నగర పరిశుభ్రత కోసం నిరంతరం శ్రమిస్తున్న స్వచ్ఛత సిబ్బంది
- కార్యక్రమంలో భాగస్వామిని చేసినందుకు గోపాల్‌కు కృతజ్ఞతలు
- స్వచ్ఛత యోధుల సేవలు వెలకట్టలేనివి. డిస్కవర్ అనిల్ కుమార్...!



**అనంతపురం టౌన్ - సూర్య వాస్తవం :** 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా స్వచ్ఛత యోధులను గౌరవించుకోవడం ఎంతో మంచి శుభపరిణామమని డిస్కవర్ అనిల్ కుమార్ అన్నారు. 1వ సర్కిల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ గోపాల్ ఆలోచనతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో శానిటరీ కార్మికుల సేవలు ఎంతో విలువైనవని పేర్కొన్నారు. ప్రతిరోజూ ఉదయం నాలుగు గంటల నుంచే శానిటరీ కార్మికులు విధుల్లోకి చేరి డ్రైనేజీలు, రహదారులు, పరిసరాలను శుభ్రం చేస్తూ ప్రజల ఆరోగ్యం, పరిశుభ్రత కోసం నిరంతరం శ్రమిస్తున్నారని తెలిపారు. వారి సేవలను గుర్తించి స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గౌరవించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో తనను కూడా భాగస్వామిని చేసిన 1వ సర్కిల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ గోపాల్‌కు డిస్కవర్ అనిల్ కుమార్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## లక్ష్మీ నరసింహ కాలనీలో పోతులయ్య విగ్ర ప్రతిష్ట



**పామిడి - సూర్య వాస్తవం :** పామిడి పట్టణంలో లక్ష్మీ నరసింహ కాలనీ 4 వార్డులో వెలసిన ఆదిశక్తి గంగా పరమేశ్వరి మాత అమ్మవారి పాదాలు. పోతులయ్య. విగ్ర ప్రతిష్ట బోనాలు శుక్రవారం దేవాలయం నుండి ఆలయ కమిటీ అధ్యక్షుడు కడ్డీలా అంజి ఆధ్వర్యంలో పామిడి పట్టణ పురవీధుల గుండా పెద్ద ఎత్తున నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటా భక్తాదులు అమ్మవారు పాదాలకి పాలాభిషేకం గంగ నీరుతో అభిషేకం చేయడం జరిగింది భక్తులు నిండు కడవ నీరు పాదాలకు పోసి పసుపు కుంకుమలు అంటిస్తూ కాయ కర్పూరం సమర్పించుకున్నారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ అధ్యక్షులు కడ్డీ అంజి ఓబులేసు దాసరి రమేష. ప్రచండ ఓబుల కొండప్ప. రవి సురేష్ చరణ్ నవీన్ రాజు ప్రభాకర. సండా. కృష్ణమూర్తి, పురోహితురాలు దాసరి రాజేశ్వరి పురోహితుడు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదవ తరగతి టాపర్‌కు ఘన సన్మానం

- కదిరి విద్యార్థిని మొగల్ అఫీఫా ఫాతిమాకు రూ.5 వేల ప్రోత్సాహక బహుమతి
- అఫీఫా విజయం కదిరి ప్రజలకు గర్వకారణం: అత్తార్ మహబూబ్ బాషా



**కదిరి - సూర్య వాస్తవం :** అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల నుంచి 2025-26 విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్షల్లో ప్రథమ ర్యాంకు సాధించిన కదిరికి చెందిన విద్యార్థిని చిన్నారి మొగల్ అఫీఫా ఫాతిమాను వేమన బాలుర ఉన్నత పాఠశాల గూజ 1973-74 బ్యాచ్ మిత్ర బృందం ఘనంగా సన్మానించింది.

ఈ సందర్భంగా అఫీఫా ఫాతిమాకు దుశ్శాలువా కప్పి సన్మానించడంతో పాటు జ్ఞాపికను అందజేసి రూ.5,000 నగదు ప్రోత్సాహక బహుమతిని అందించారు. ఈ సందర్భంగా మిత్ర బృందం సభ్యుడు హాజీ అత్తార్ మహబూబ్ బాషా మాట్లాడుతూ.. ఉమ్మడి రెండు జిల్లాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో కదిరికి చెందిన విద్యార్థిని ప్రథమ స్థానం సాధించడం కదిరి ప్రజలందరికీ గర్వకారణమన్నారు. అఫీఫా సాధించిన విజయం ప్రతి విద్యార్థికి స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు. అలాగే విద్యార్థినుల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరిచిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు వేంకటాచలం, తెలుగు ఉపాధ్యాయురాలు శ్రీమతి యశోదను మిత్ర బృందం తరపున ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో హాజీ అత్తార్ మహబూబ్ బాషా, టి. శ్రీనివాసులు, ఎస్.ఎం.డి. బాషా, ఎల్. రెడ్డి, కె. అజ్మతుల్లా ఖాన్, సి. రమేష్ బాబు, టి. రామలింగయ్య, కాటం వీరనారాయణ, ఎం.ఎన్. అల్లాబకష్, మిలటరీ మగ్దూమ్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రావణమాస పూజలతో ఆలయాల్లో భక్తిభావం

- గోవిందుడికి జలాభిషేకం, పంచామృత అభిషేకాలు

**అనంతపురం సిటీ - సూర్య వాస్తవం :** నగరంలోని పలు ఆలయాల్లో శనివారం శ్రావణమాస పూజలతో పాటు ఏడు శనివారాల వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. హౌసింగ్ బోర్డు ఆర్ఎఫ్ రోడ్డు, రాంనగర్‌లోని లక్ష్మీ వేంకటేశ్వరాలయాలు, సత్యదేవాలయం, షిర్డీ సాయిబాబా ఆలయాల్లో జరిగిన ప్రత్యేక పూజలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై పరవశించారు. వ్రతంలో భాగంగా శ్రీ గోవిందుడికి జలాభిషేకం, పంచామృత అభిషేకాలను నిర్వహించారు. అనంతరం అర్చక బృందం ఏడు శనివారాల వ్రత విశిష్టతను భక్తులకు వివరించారు. ఈ సందర్భంగా మూలమూర్తులకు చేసిన ప్రత్యేక అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ముఖ్యంగా మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



# సేవా కార్యక్రమాలతో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

- సీఐ ఎస్‌ఎం అలీ చేతుల మీదుగా సేవా కార్యక్రమాల నిర్వహణ
- 50 వేల విలువైన కెమిస్ట్రీ, ఫిజిక్స్ ల్యాబ్ పరికరాలు, గ్రీన్ చార్ట్ బోర్డుల అందజేత
- మార్గ్స్ సేవా ట్రస్ట్ ప్రతినిధులను అభినందించిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు,
- మార్గ్స్ సేవా ట్రస్ట్ ప్రతినిధులకు ఘన సన్మానం



అనంతపురం -సూర్య వాస్తవం: 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మార్గ్స్ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో చెన్నేకొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన ఈ రోజును పండుగగా జరుపుకోవడంతో పాటు, తాము పుట్టిన గడ్డకు, సమాజానికి తమ వంతు సేవ చేయాలనే ఉద్దేశంతో మార్గ్స్ సేవా ట్రస్ట్‌ను ఏర్పాటు చేసినట్లు ట్రస్ట్ ప్రతినిధులు తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల సూచన మేరకు వారికి అవసరమైన కెమిస్ట్రీ, ఫిజిక్స్ ల్యాబ్ పరికరాలు, గ్రీన్ చార్ట్ బోర్డులు తదితర సామగ్రిని సుమారు రూ.50 వేల విలువతో ట్రస్ట్ తరపున అందజేశారు. అదేవిధంగా 8వ తరగతి చదువుతున్న అరుణ కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న విషయం తెలుసుకుని, ఆమె తల్లి అభ్యర్థన మేరకు విద్యార్థినికి ఆర్థిక సహాయం అందించారు. ఈ సేవా కార్యక్రమంలో చెన్నేకొత్తపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎస్‌ఎం అలీ చేతుల మీదుగా విద్యార్థులకు పరికరాలు, సహాయాన్ని అందించడం తమకు ఎంతో సంతోషంగా ఉందని ట్రస్ట్ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మార్గ్స్ సేవా ట్రస్ట్ ప్రతినిధులను ఘనంగా సత్కరించి, ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో కూడా మరింత మందికి సేవా కార్యక్రమాలు అందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సీఐ ఎస్‌ఎం అలీ, మార్గ్స్ సేవా ట్రస్ట్ ప్రతినిధులు పేరూరు మోహన్ బాబు, చియ్యేడు గోపాల్, కుంటిమద్ది రమేష్, చిన్నపల్లి సోమశేఖర్ రెడ్డి, , సోమశేఖర్ రెడ్డి, వాసగిరి నాగ్, దాసిరెడ్డి తదితరులుపాల్గొన్నారు. భవిష్యత్తులో మరింత మందికి సేవ చేయాలని కోరుకున్నాం.



## అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్ హోలిగ నరసప్పకు ప్రశంసా పత్రం

- పని పట్ల అయన నిబద్ధతకు ఇదే తార్కాణమన్న తోటి అధికారులు
- హోలిగ నరసప్పను అభినందించిన తోటి అధికారులు, సిబ్బంది



**అనంతపురం సిటీ - సూర్య వాస్తవం:** కర్నూలులో రాష్ట్ర ఆడిట్ డైరెక్టర్, రీజినల్ డైరెక్టర్ ఆధ్వర్యంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్ హోలిగ నరసప్ప పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆయనకు ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా తోటి అధికారులు, సిబ్బంది హోలిగ నరసప్పను అభినందించారు. విధుల పట్ల ఆయనకున్న నిబద్ధత, అంకితభావానికి ప్రశంసా పత్రం నిదర్శనమని పేర్కొన్నారు. ప్రశంసా పత్రం అందుకున్న హోలిగ నరసప్ప మాట్లాడుతూ తనకు ఈ గౌరవం లభించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. విధుల నిర్వహణలో తనకు సహకరించిన తోటి అధికారులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. స్వాతంత్ర్యం కోసం ఎందరో మహనీయులు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా బ్రిటిష్ పాలకులపై పోరాడారని పేర్కొన్నారు. అల్లూరి సీతారామరాజు, భగత్‌సింగ్, సుభాష్ చంద్రబోస్ వంటి ఎందరో స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల ఫలితంగానే దేశానికి స్వాతంత్ర్యం లభించిందన్నారు. స్వేచ్ఛా భారతదేశంలో జీవించే అవకాశం కల్పించేందుకు తమ ప్రాణాలను అర్పించిన స్వాతంత్ర్య సమరయోధులకు ఘన నివాళులు అర్పించాలని పిలుపునిచ్చారు. వారి త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని దేశ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని సూచించారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని తోటి అధికారులు, సిబ్బంది, ప్రజలకు హోలిగ నరసప్ప హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

## వరుణ దేవుడా కరుణించవా

- వర్షం కోసం ముస్లిము సోదరుల ప్రత్యేక ప్రార్థనలు





**గార్లదిన్నె -సూర్య వాస్తవం:** అనంతపురం జిల్లా సింగనమల నియోజకవర్గం గార్లదిన్నె మండలంలోని కల్లూరు గ్రామపంచాయతీ పరిధిలోనీ ముస్లిం సోదరులు అందరూకలసి శనివారం వర్షంకోసం రైతాంగం తపిస్తూ ఆవేదనను చూసి అల్లా(వరుణ్ దేవుడా)కరుణించి ఎండిపోతున్న పంట పొలాలను బ్రతికించవాని వరుణ దేవుని కోసం ప్రత్యేక ప్రార్థనలు తమ ప్రార్థన ప్రాంగణములో జామియా మజీద్,మదీన మజీద్, బిలాల్ మజీద్, అబుబకర్ మజీద్ ముక్తవుల్ ఖురాన్ మదరసా ప్రత్యేకమైన ప్రార్థనలు నిర్వహించారు. జూన్ వాసంలో కురిసిన తడిపూడి వర్షానికి సకాలంలో వర్షం వచ్చిందని రైతులు ఎంతో ఆశతో పంటలు సాగు చేశారని, దాదాపు రోజులు గడుస్తున్న వర్షం రానందున మొలచిన పంట పొలాలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తపరిచారు. ముస్లిం సోదరులు అందరూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

## దేశభక్తిని సాటిన రంగస్థల కళాకారులు



**పామిడి-సూర్య వాస్తవం:** పామిడి పట్టణంలోని ఎద్దులపల్లి రోడ్డులో ఉన్న స్వరరాగ నాటక కళాసమితి ఉచిత శిక్షణాలయంలో స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని దేశ భక్తిని సాటి చెప్పిన కళాకారులు. ఈ సందర్భంగా స్వరరాగ నాటక కళా సమితి ఉచిత శిక్షణాలయం వ్యవస్థాపక అధ్యక్షులు,సంగీతదర్శకుడు, రిటైర్డ్ వైద్యాధికారి అయిన ఎం దేవరాజు మాట్లాడుతూ దాదాపు 200 సంవత్సరాలు పాలించారని, వారి పాలనలో భారతీయులు స్వేచ్ఛతనం లేకుండా జీవించారని, వారి ఉక్కు పాదాలకు మ్రగ్గిపోయారని, అలాంటి దుర్భర స్థితి నుంచి ఎందరో మహానీయులు ప్రాణత్యాగాలు, పోరాటాలు, జైలులోనే అంతరించిన వారి త్యాగాల ఫలమే వారి నుంచి విముక్తి చెంది కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు అఖిల భారతదేశానికి బ్రిటిష్ వారి నుంచి 1947 ఆగస్టు15న స్వాతంత్రము,స్వేచ్ఛ సార్వభౌమాధికారాలుకల్పించాలని కొనియాడారు. ఈకార్యక్రమంలో ఎం దేవరాజు, గౌరవాధ్యక్షులు పుంజా కృష్ణారావు, హనుమంతరెడ్డి, నారా యణరెడ్డి, చీమల పెద్ద తిరుపాలు, ప్రతాపరెడ్డి, నాగార్జున, బెస్తసుబ్రమణ్యం, ఓబులేసు, బ్రహ్మయ్య తదితర కళాకారులు పాల్గొని నిత్యం పూజించే అమరవీరులు జాతీయ నాయకులకు ఘన నివాళులర్పించారు.

## గుత్తి సీఐకి ఉత్తమ అవార్డు

**గుత్తి - సూర్య వాస్తవం :** గుత్తి మండలంసమాజంలో శాంతిభ ద్రతల పరిరక్షణ,అసాంఘిక కార్యక లాపాల అణచివేత మరియు ప్రజ ల భద్రతే ధ్యేయంగా ఆయన అంది స్తున్న విశిష్ట సేవలకు గుర్తింపుగా గు త్తి సీఐగా విధులు నిర్వహిస్తున్నఎం. రామారావుకు శనివారం అనంతపు రం పరేట్ గ్రౌండ్స్లోజరిగిన స్వాతం త్ర్య వేడుకలో ఉత్తమ సేవా పుర స్కారాన్ని(అవార్డు) మంత్రి పయ్యా వుల కేశవ్,కలెక్టర్ ఆనంద్,ఎస్పీ జగ దీశ్ చేతుల మీదుగా అందుకున్నా రు. జిల్లా యంత్రాంగం మరియు ఎ స్సైలు సురేశ్,అమిర్ ఖాన్,పోలీస్ సిబ్బంది సీఐ రామారావుకి శుభా కాంక్షలు తెలిపారు.



## యూజేఏసీ కార్యాలయంలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

జాతీయ జెండాను ఎగురవేసిన యూజేఏసీ కన్వీనర్ జాఫర్
స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకున్న నాయకులు
కార్యక్రమంలో పాల్గొన్న వివిధ రాజకీయ పార్టీల నాయకులు



**అనంతపురం టౌన్ - సూర్య వాస్తవం :** 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని అనంతపురం సాయినగర్‌లోని యూజేఏసీ కార్యాలయం (దాదా గాంధీ) వద్ద జాతీయ జెండాను యూజేఏసీ కన్వీనర్ జాఫర్ ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అడ్వకేట్ అబ్దుల్ రసూల్, మైనారిటీ పత్రిక ఎడిటర్ బాబాషా, కాంగ్రెస్ మైనారిటీ విభాగం అధ్యక్షులు దాదా గాంధీ, వక్ఫ్ బోర్డు మాజీ చైర్మన్ కాగజ్ ఘర్ రిజ్వాన్, సీపీఐ నాయకులు గోల్డ్ బాషా, వైసీపీ మైనారిటీ నాయకులు షేక్ జావీద్, షఫీ, అలీతో పాటు యూజేఏసీ నాయకులు, పెద్దలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతీయ పతాకానికి గౌరవ వందనం సమర్పించి, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకున్నారు. దేశ ఐక్యత, సమగ్రతను కాపాడుతూ ప్రజలందరూ దేశాభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని కార్యక్రమంలో పాల్గొన్న వారు పిలుపునిచ్చారు.

## శేష వాహనంపై విహరించిన శ్రీ భద్రకాళి సమేత వీరభద్రస్వామి

**ఉరవకొండ - సూర్య వాస్తవం :** విడపనకల్లు మండలం ఉండబండలోని శ్రీ భద్రకాళి సమేత వీరభద్రస్వామి వారి వార్షిక ఉత్సవాలు వైభవంగా కొన సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు శనివారం స్వామివారు శేష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాల సందర్భంగా ఆలయంలో మూలవిరాట్‌కు ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి విశేష ద్రవ్యాలతో అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, నవగ్రహ పూజ, వాస్తు హోమం, మంత్రపుష్పం తదితర పూజా కార్యక్రమాలు చేపట్టారు. రాత్రి పునఃపూజ, ఆవాహిత మండప హోమం, దేవతా హోమం, రుద్ర హోమం నిర్వహించిన అనంతరం శేష వాహన సేవను ఘనంగా నిర్వహించారు. శ్రీ భద్రకాళి సమేత వీరభద్రస్వామి వారి ఉత్సవ విగ్రహాలను శేష వాహనంపై ఊరేగించగా, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, ఆలయ ఈవో విజయ్ కుమార్, ఉత్సవ కమిటీ సభ్యులు, అన్నదాన కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





## రెండున్నర కోట్లతో 3.9 కి.మీ రోడ్డు ప్రారంభం

- గత ఐదేళ్లలో రోడ్లపై గుంతలు పూడ్చిన పాపాన పోలేదు
- కూటమి ప్రభుత్వం వచ్చాక నగరంలో రోడ్లు, డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి చర్యలు: ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్



**అనంతపురం ప్రతినిధి - సూర్య వాస్తవం :** అనంతపురం నగరంలో రోడ్ల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. రెండున్నర కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టిన 3.9 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. సప్తగిరి సర్కిల్‌లోని కేఎస్‌ఎన్ పాఠశాల వద్ద శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ.. గత ఐదేళ్లలో నగరంలోని రోడ్ల పరిస్థితిని పట్టించుకోలేదని, కనీసం చిన్నచిన్న మరమ్మతులు కూడా చేపట్టలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నగరంలో రోడ్లు, డ్రైనేజీ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించామని చెప్పారు. ఇప్పటికే సుమారు రూ.200 కోట్లతో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణ పనులు చేపట్టామని తెలిపారు. తాజాగా ప్రారంభించిన 3.9 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణంతో నగర ప్రజలకు ఎంతో ఉపశమనం కలుగుతుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ సహకారంతో రానున్న రోజుల్లో అనంతపురం నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ అధికారులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## దత్త పాదుక క్షేత్రంలో గీతా జ్ఞాన యజ్ఞము సంపూర్ణం



**పామిడి- సూర్య వాస్తవం :** అనఘా ఆత్రేయ దత్త పాదుకా క్షేత్రము 8 నుండి ఆగస్టు 15 వరకు ప్రతిరోజు సాయంత్రం 6:30 నుండి 8 గంటల వరకు పూజ్య గురువులు పరమపూజ్యులు గణపతి సచ్చిదానంద స్వామిజీ వారి దివ్య ఆశీస్సులతో పూజ్యశ్రీ బాల స్వామీజీ వారి అనుమతితో పామిడి .శ్రీ అనఘా ఆత్రేయ దత్త పాదుకా క్షేత్రం. నందు అనంతపురం చిన్మాయ మిషన్ స్వామి ఆత్మవిదానంద సరస్వతి, భగవద్గీత 3వ అధ్యాయం (కర్మయోగము) పై గీతా జ్ఞాన యజ్ఞము భక్తి శ్రద్ధలతో నిర్వహించబడింది. భగవద్గీత దివ్యజ్ఞానాన్ని శ్రవణం చేసి, జీవన విధానాన్ని ఆధ్యాత్మిక దిశగా మలుచుకొనే ఈ పవిత్ర అవకాశాన్ని వందలాది మంది సద్వినియోగం చేసుకున్నారు.

# ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం :** జంతలూరులోని 14వ బెటాలియన్‌లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బెటాలియన్ కమాండెంట్ ప్రభు కుమార్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, జెండా వందనం స్వీకరించారు.అనంతరం బెటాలియన్‌లో నూతనంగా శిక్షణ పొందుతున్న ఎస్ఆర్‌టీపీసీ ట్రైనీలు, పోలీసు అధికారులు, సిబ్బందికి కమాండెంట్ ప్రభు కుమార్ స్వీట్లు పంపిణీ చేసి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

గుత్తిలో..గుత్తి పట్టణం గుత్తి మున్సి పల్ ఆఫీసు యందు 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడు కలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కమీషనర్ బి.జ బ్బార్ మియా పట్టణ ప్రజల కు,ప్రజా ప్రతినిధులకు,అధి కారులకు,సిబ్బందికి,సచివా లయ సిబ్బందికి,కార్యక్రమం లో పాల్గొన్న వివిధ రాజకీ య పార్టీ నాయకులకు శు భాకాంక్షలు తెలిపారు.

**సిపిఐ, ఆఫీసు ఆవరణలో...**



గుత్తి పట్టణం,సిపిఐ,ఆఫీసు ఆవ రణంలో 80వ స్వాతంత్ర దినోత్స వం సందర్భంగా, సీపీఐ,గుత్తి,మండల కార్యదర్శి జి.రామదాసు,అధ్యక్ష తన జెండా ఆవిష్కరణ కార్యక్రమం. ఘనంగా నిర్వహించారు.

**ఉరవకొండలో..**



ఉరవకొండ పట్టణంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పండుగ వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం, గవి మఠం దేవాలయం, పట్టణంలోని గాంధీ బజార్‌లోని స్వాతంత్ర్య చిహ్నం వద్ద టీడీపీ సీనియర్ నాయకులు ప్యారం కేశవానంద జాతీయ జెండాలను ఆవిష్కరించారు. అనంతరం స్వాతంత్ర్య సమరయోధుల సేవలను స్మరించు కున్నారు.



**కదిరి నారాయణ పాఠశాలలో...**

పట్టణంలోని నారాయణ పాఠశాలల ఏటీఎం పఠాన్ సర్ఫరాజ్ ఖాన్ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు.

**పామిడి సిహెచ్సిలో...**




పామిడి పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో అభివృద్ధి కమిటీ ప్రధాన సభ్యులు చిలకల రాజగోపాల్, వైద్యాధికారుల ఆధ్వర్యంలో శనివారం స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు.



**అనంతపురంలో..**వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జాతీయ పతాక ఆవిష్కరణ

అనంత వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు వేడుకల్లో పాల్గొన్న ఉరవకొండ నియోజకవర్గ సమన్వయకర్త విశ్వేశ్వర్ రెడ్డి,

భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని అనంతపురంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో జాతీయ పతాక ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు అనంత వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్య క్రమంలో ఉరవకొండ నియోజకవర్గ సమన్వయకర్త విశ్వేశ్వర్ రెడ్డి, రమేష్ గౌడ్, సి.పి. వీరన్నతో పాటు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**కదిరి జైన్ పాఠశాలలో ..** పట్టణ మునిసిపల్ పరిధిలోని బేరుపల్లిలోని జైన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు, పాఠశాల జైన్ పాఠశాల కరస్పాండెంట్ సాగర్ మరియు హై స్కూల్ కోఆర్డినేటర్ బాలాజీ , ప్రైమరీ కోఆర్డినేటర్ భాగ్యలక్ష్మి, సీనియర్ మేనేజర్ సరస్వతి, యాజమాన్యం నిర్వాహకులు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణం లో త్రివర్ణ పతాకాలతో అలంకరించారు , విద్యార్థిని ,విద్యార్థులు స్వాతంత్ర సమరయోధుల వేషధారణలో ఎంతగానో అలరించారు, అనంతరం దేశభక్తి గేయాలకు నృత్య ప్రదర్శనలతో పాఠశాల ఆవరణం కరతాల ధ్వనులతో మారుమ్రోగి పోయాయి, ముఖ్యంగా భారతదేశం శత్రుదేశంపై సర్జికల్ స్ట్రైక్ నిర్వహణను దృశ్య రూపాన్ని పాట రూపంలో అభినయించిన తీరు చాలా ఉద్వేగానికి గురిచేశాయి, అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థిని ,విద్యార్థుల కు ప్రాథమిక స్థాయి విద్యనుండే దేశభక్తి భావం పెంపొందించుకుంటూ వారికి సాంస్కృతిక, సామాజిక, క్రీడా రంగాలలో చైతన్యవంతులుగా తీర్చిదిద్దడమే మా లక్ష్యం అంటూ పేర్కొన్నారు అనంతరం తమ ప్రదర్శనను ప్రదర్శించిన విద్యార్థిని విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు, అనంతరం వారికి జ్ఞాపకం అందజేశారు, ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, యాజమాన్యం తదితరులు పాల్గొన్నారు

**దొరవారిసత్రంలో...** దొరవారిసత్రం మండల పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాలు, తాసిల్దార్ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయం,ఐకెపి కార్యాలయం, విద్యాశాఖ కార్యాలయం, కేజీబీవీ పాఠశాల,బీసీ గురుకుల పాఠశాల ఏకొల్లు జడ్పీ హైస్కూల్,పోలీస్ స్టేషన్,వద్ద 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకను వైభవోపేతంగా నిర్వహించారు. ఆయా కార్యాలయాల అధికారులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు జాతీయ జెండాను ఎగురవేసి స్వాతంత్రం గురించి తెలియజేశారు. తాసిల్దార్ కార్యాలయంలో తాసిల్దార్ రాజేంద్ర, ఎంపీడీవో గోవర్ధన్, ఎంఈఓ కొండయ్య, కృష్ణయ్యలు జాతీయ జెండా ఎగురవేశారు. ఎస్సై జీవీ నాయుడు పోలీస్ స్టేషన్లో సిబ్బందితో కవాతు నిర్వహించి త్రివర్ణ పతాకాన్ని ఎగుర వేయడం జరిగింది. అదేవిధంగా బీసీ గురుకులంలో ప్రిన్సిపాల్ తిరుపతయ్య, కేజీబీవీ కళాశాలలో ప్రిన్సిపాల్ పార్వతి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి చంద్రకళ జెండా ఎగరవేసి స్వాతంత్రదిన చరిత్రను గురించి తెలియజేశారు.



**మాజీ సైనికుల చే ఘనంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకలు**



తిరుపతి కపిల తీర్థం సమీపంలోని వార్ మెమోరియల్ వద్ద శనివారం 80 వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను తిరుపతి జిల్లా మాజీ సైనికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు టీటీడీ పాలకమండలి సభ్యులు భాను ప్రకాష్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.దేశ సార్వభౌమత్వాన్ని కాపాడేందుకు ప్రాణాలర్పించిన స్వాతంత్ర సమరయోధుల సాయుధ దళాల త్యాగాలను స్మరించుకున్నారు.



**పెళ్లకూరులో..**భారత 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని తిరుపతి జిల్లా పెళ్లకూరు మండలంలో శనివారం స్వాతంత్ర్య స్ఫూర్తి, దేశభక్తి, జాతీయ భావాలతో వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, పోలీస్ స్టేషన్‌తో పాటు వివిధ ప్రాంతాల్లో జాతీయ పతాకాలను ఆవిష్కరించి మహనీయుల త్యాగాలను స్మరించుకున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీసు సిబ్బంది, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను విజయవంతం చేశారు.

**ఉత్తమ సేవలకు ఎంపీడీవో డాక్టర్ వేణయ్యకు ప్రశంసాపత్రం**



స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా మండల అభివృద్ధికి, ప్రజలకు అందు బాటులో ఉంటూ ఉత్తమ సేవలు అందిస్తున్న పెళ్లకూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారి డాక్టర్ వేణయ్యను ప్రత్యేకంగా అభినందించారు. సూళ్లూరుపేట నియోజ కవర్గ ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ చేతుల మీదుగా ఆయనకు ఉత్తమ సేవలకు సంబంధించిన ప్రశంసాపత్రాన్ని అందజేశారు.



**శిరసనంబేడులో ...** పెళ్లకూరు మండలం శిరసనంబేడు ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తెలుగుదేశం పార్టీ యువనేత వేలూరు కళ్యాణ్ రెడ్డి ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. కళ్యాణ్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, జాతీయ గీతాలాపన అనంతరం పతాకానికి వందనం సమర్పించారు.

అనంతరం విద్యార్థులకు స్వయంగా మిఠాయిలు, చాక్లెట్లు పంపిణీ చేసి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు సందేశాన్ని అందించారు.

ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు వేలూరు మురళీకృష్ణ రెడ్డి, వేలూరు సాయి గిరిధర్ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, భాస్కర్, కృష్ణ ప్రసాద్, సుభాష్, చంద్ర, వంశీకృష్ణ, నాని, లీలా మోహన్, గ్రామ పెద్దలు, నాయకులు, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

**జడ్పీ ఉన్నత పాఠశాలలో ..**

పెళ్లకూరు మండల జడ్పీ ఉన్నత పాఠశాలలోనూ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు. అనంతరం అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు.

ఎంపీడీవో, తహసీల్దార్, మండల విద్యాశాఖ అధికారులు పాల్గొనగా, ముఖ్య అతిథులుగా బీజేపీ తిరుపతి జిల్లా ఉపాధ్యక్షులు ఎద్దల నరేంద్ర రెడ్డి, రమేష్ నాయుడు, చైతన్య కృష్ణారెడ్డి, సంచి కృష్ణయ్య, జనసేన నాయకులు తాళ్ల రెడ్డి శ్రీనివాస్, బీజేపీ మండల అధ్యక్షులు కలిచేటి నరసింహులు, మాజీ మండల అధ్యక్షులు గోగుతోట్ట మురళి తదితరులు పాల్గొన్నారు.

**పోలీస్ స్టేషన్‌లో దేశభక్తి ఉట్టిపడేలా వేడుకలు**



పెళ్లకూరు పోలీస్ స్టేషన్‌లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎస్సై దారం ఆదిలక్ష్మి పోలీస్ స్టేషన్ ఆవరణలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, మువ్వన్నెల పతాకానికి పోలీసు లాంఛనాలతో గౌరవ వందనం సమర్పించారు. పోలీసు సిబ్బంది క్రమశిక్షణతో నిర్వహించిన కార్యక్రమం చూపరులను ఆకట్టుకుంది. అనంతరం పోలీస్ స్టేషన్‌కు వచ్చిన చిన్నారులకు ఎస్సై దారం ఆదిలక్ష్మి స్వయంగా మిఠాయిలు పంచిపెట్టి స్వాతంత్ర్య దినోత్సవ శు భాకాంక్షలు తెలిపారు.

**పెళ్లకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోనూ జెండా వందనం**



పెళ్లకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించారు. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జాతీయ గీతాన్ని ఆలపించారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన సమరయోధులను స్మరించుకుని వారికి ఘన నివాళులు అర్పించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేయాలని ఈ సందర్భంగా సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు.

**ఎంపీడీవో కార్యాలయంలో జాతీయ పతాకావిష్కరణ**



పెళ్లకూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలోనూ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జాతీయ గీతాన్ని ఆలపించారు. అధికారులు, సిబ్బంది స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకున్నారు.

**నాయుడుపేటలో....** భారత 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సూళ్లూరుపేట నియోజకవర్గ పరిధిలో, ముఖ్యంగా నాయుడుపేట పట్టణంలో శనివారం స్వాతంత్ర్య వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయం, రాజకీయ పార్టీ కార్యాలయాలు, పాఠశాలలు, గాంధీ పార్కు తదితర ప్రాంతాల్లో జాతీయ పతాకాలను ఆవిష్కరించి స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకున్నారు. జాతీయ గీతాలాపన, దేశభక్తి నినాదాలు, విద్యార్థుల ర్యాలీలతో పట్టణంలో పండుగ వాతావరణం నెలకొంది.

**ఆర్డీఓ కార్యాలయంలో ఎమ్మెల్యే విజయశ్రీ హాజరు**



సూళ్లూరుపేట ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో సూళ్లూరుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ పాల్గొని జాతీయ పతాకానికి గౌరవ వందనం చేశారు.

**గాంధీ పార్కులో మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం ప్రత్యేక సందేశం**



నాయుడుపేట పట్టణంలోని గాంధీ పార్కులో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఎల్.ఏ. సాగరం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం కార్యక్రమంలో పాల్గొన్నారు. మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

**500 అడుగుల జాతీయ జెండాతో విద్యార్థుల భారీ ర్యాలీ**

ఎల్.ఏ. సాగరం ఉన్నత పాఠశాలలో నిర్వహించిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు విద్యార్థుల దేశభక్తిని ప్రతిబింబించేలా సాగాయి. పాఠశాల కమిటీ చైర్మన్ నెలవల చంద్రశేఖర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పాఠశాల నుంచి గాంధీ విగ్రహం వరకు విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి సుమారు 500 అడుగుల పొడవైన భారీ జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు.

కార్యక్రమంలో పాఠశాల కమిటీ వైస్ చైర్మన్ జమీలా, ప్రధానోపాధ్యాయులు సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు అవధానం సుధీర్, గంగా ప్రసాద్, కరీం భాయ్ చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.

**మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా వేడుకలు**

నాయుడుపేట మున్సిపల్ కార్యాలయంలో కూడా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ షేక్ పజురుల్లా ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది, కార్మికులు కార్యక్రమంలో పాల్గొని జాతీయ పతాకానికి గౌరవ వందనం చేశారు.

**తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో దేశభక్తి సందేశం**

నాయుడుపేటలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కూడా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించారు. సూళ్లూరుపేట నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి స్వాతంత్ర్య సమరయోధుల పోరాటాలు, దేశ స్వాతంత్ర్య చరిత్ర, ప్రజాస్వామ్య వ్యవస్థ ప్రాధాన్యతపై ప్రసంగించారు.

**ఏఎంసీ కార్యాలయంలో జాతీయ పతాకావిష్కరణ**

నాయుడుపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఏఎంసీ చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.



అనంతరం జాతీయ గీతాన్ని ఆలపించి దేశభక్తిని చాటుకున్నారు. .

**జనసేన పార్టీ కార్యాలయంలోనూ జెండా ఆవిష్కరణ**

నాయుడుపేటలోని సూళ్లూరుపేట నియోజకవర్గ జనసేన పార్టీ కార్యాలయంలో ఏఎంసీ చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించారు. జాతీయ జెండాను ఆవిష్కరించి జాతీయ గీతాన్ని ఆలపించారు. స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయులకు ఘన నివాళులు అర్పించారు.

**బి.ఆర్. అంబేద్కర్ పాఠశాలలో విద్యార్థులకు వైద్య దంపతుల సందేశం**

నాయుడుపేట పట్టణంలోని బి.ఆర్. అంబేద్కర్ ప్రాథమిక పాఠశాలలో కూడా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ప్రముఖ ట్రినిటీ వైద్యశాల నిర్వాహకులు డాక్టర్ అనుదీప్, డాక్టర్ నీలిమా ప్రియదర్శిని పాఠశాలను సందర్శించి విద్యార్థులకు స్వాతంత్ర్య దినోత్సవ ప్రాధాన్యతను వివరించారు.

**దేశభక్తి నినాదాలతో మార్మోగిన నాయుడుపేట**

మొత్తంగా నాయుడుపేట పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయాలు, రాజకీయ పార్టీ కార్యాలయాలు, విద్యాసంస్థలు, గాంధీ పార్కు తదితర ప్రాంతాల్లో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు దేశభక్తి, జాతీయ సమైక్యతకు ప్రతీకగా నిలిచాయి. ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, అధికారులు, రాజకీయ నాయకులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, కార్మికులు, జనసైనికులు, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని జాతీయ పతాకానికి గౌరవ వందనం చేశారు.

**కర్నూల్‌లో..**



కర్నూలు జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ లిమిటెడ్ కార్యాలయంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వై. నాగేశ్వరావు యాదవ్ కర్నూలు డీసీఎంఎస్ చైర్మన్ ఉ జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ వై. నాగేశ్వరరావు యాదవ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జెండా వందనం చేశారు.

# 'హుషార్ పిట్టలు' మూవీ రివ్యూ

ఈ మధ్య కాలంలో టీజర్‌తో హాట్‌టాపిక్‌గా మారిన చిత్రం 'హుషార్ పిట్టలు'. టీజర్‌లో ఉన్న బోల్డ్ కంటెంట్ యువతను ఆకట్టుకుంది. దీంతో పాటు పాటలు, ట్రైలర్ కూడా ఆకట్టుకోవడంతో ఈ సినిమా చూడాలన్న ఆసక్తి యూత్‌లో కలిగింది. నూతన తారాగణంతో, బిక్షు అనే నూతన దర్శకుడు తెరకెక్కించిన ఈ సినిమా ఆగస్టు 15న విడుదలైంది. ఇక ఈ సినిమా ఎలా ఉంది? యూత్‌ను అలరించే అంశాలు ఈ చిత్రంలో ఉన్నాయా? ప్రేక్షకులకు ఈ సినిమా ఎలాంటి అనుభూతిని అందించింది? అనేది రివ్యూలో తెలుసుకుందాం. రవి (అన్ష్) టెన్త్‌లో టాపర్. స్కూల్‌లో ఫస్ట్. చదువు అంటే ఎంతో ఇష్టం. ఇలాంటి కుర్రాడిని ఆ ఊరిలో ఉండే ఆకతాయి బాలు గ్యాంగ్ మొబైల్‌లో అశ్లీల వీడియోలు చూపించి అతని దృష్టిని చెడు వైపు మళ్లిస్తారు. దీంతో చదువు మీద ఆసక్తిని పక్కకు పెట్టేసి అమ్మాయిలపై దృష్టి పెడతాడు. ఆ సమయంలోనే ఆ ఊరిలో ఉండే చిట్టి (వాసవి గణేషన్) రవిని చూసి ఆకర్షణలో పడిపోతుంది. అప్పటికే ఇద్దరికి ఒకరిపై ఒకరికి ఆకర్షణ ఉండటంతో, పరిపక్వత లేని వయసులోనే ఇద్దరు హద్దులు దాటేస్తారు. కొన్ని రోజులు వీళ్లు ఎవరికి తెలియకుండా ఇలాగే కలుస్తుంటారు.

ఒక రోజు అనుకోకుండా ఇద్దరూ ఒకే గదిలో ఉన్న సమయంలో తల్లిదండ్రులకు దొరికిపోతారు. ఇక ఆ సిట్యుయేషన్‌లో తమ పిల్లలను చూసిన పేరెంట్స్ ఎలాంటి క్షోభను అనుభవించారు? పిల్లల విషయంలో తల్లిదండ్రులు తీసుకున్న నిర్ణయాలు ఏమిటి? రవి, చిట్టిల జీవితంలో చోటు చేసుకున్న సంఘటనలేమిటి? ఈ జంట తమ ప్రేమను గెలిపించుకున్నారా? చిన్న వయసులో ఆకర్షణకు లోనై వాళ్లు చేసిన తప్పుల వల్ల వాళ్ల జీవితాలు ఎలా మారాయి? అనేది మిగతా కథ.

యూత్‌ను లక్ష్యంగా బోల్డ్ కంటెంట్‌కు ఎంటర్‌టైన్‌మెంట్‌తో పాటు సందేశాన్ని జోడించి దర్శకుడు ఈ కథను తయారుచేసుకున్నాడు. టీజర్, ట్రైలర్‌లు కూడా బోల్డ్‌గానే ఉండటంతో ఈ సినిమాపై యూత్‌కు ఓ అంచనాకు వచ్చేశారు. ఫస్ట్‌హాఫ్‌లో రెండు ఆకట్టుకునే పాటలు, బోల్డ్ కంటెంట్, ఎంటర్‌టైన్‌మెంట్‌తో యూత్ కావాల్సిన అంశాలు పుష్కలంగా నింపేశాడు. దర్శకుడు ఫస్ట్‌హాఫ్‌లో బోల్డ్ కంటెంట్‌ను ఎంత శ్రద్ధగా రాసుకున్నాడో.. సెకండాఫ్‌లో ఫ్యామిలీ ఎమోషన్స్‌ను కూడా అంతకు మించి బలమైన




భావోద్వేగాలను రెడీ చేసుకుని హృదయాలకు హత్తుకునే విధంగా స్క్రీన్‌పై ప్రజెంట్ చేశాడు. ముఖ్యంగా పతాక సన్నివేశాల్లో ఉన్న సందేశాన్ని కన్విన్సింగ్ చెప్పడంలో దర్శకుడు సఫలీకృతుడయ్యాడు. హీరో, హీరోయిన్ల పరిచయం, వారి మధ్య వచ్చే సన్నివేశాలు, బాలు గ్యాంగ్‌తో హీరో జరిపే సంభాషణలు, శైలు అక్కతో హీరోయిన్ చేసే సాహసాలు ఇవన్నీ ప్రేక్షకులు వినోదంతో పాటు థ్రిల్‌ను పంచుతాయి. ఇక రవి, చిట్టిల రహస్య కలయిక బయటపడిన తరువాత ద్వితీయార్థాన్ని దర్శకుడు ఎలా డీల్ చేస్తాడో అనే సందేహం అందరిలో కలుగుతుంది. అయితే సెకండాఫ్‌లో బలమైన ఎమోషన్ రెడీ చేసుకుని, రవి, చిట్టిలు ఇలా తప్పటడుగులు వేయడానికి కారణాన్ని చెప్పడంలో, ఆ రీజన్స్ కరెక్టేనని ఆడియన్స్ భావించే విధంగా దర్శకుడు డీల్ చేశాడు. చిన్నప్పటి నుంచే సెల్‌ఫోన్‌కు ఎడిక్ట్ అవ్వడం, తప్పుడు స్నేహాలు, వాళ్ల పిల్లలు ఎలాంటి తప్పుదారుల్లో నడిచే అవకాశం ఉందో చెప్పి అందర్నీ ఆలోచింపజేశారు. పిల్లలు తప్పుదారిలో నడవడం వల్ల తల్లిదండ్రులు ఎలాంటి క్షోభ అనుభవించాల్సి వస్తుందనే విషయాన్ని కొన్ని సన్నివేశాల్లో ఆవిష్కరించారు. పతాక సన్నివేశాలు ఎంతో భావోద్వేగభరితంగా ఉంటాయి. ఓవరాల్‌గా దర్శకుడు ఓ సక్సెస్ కోసం అన్ని ప్యారామీటర్‌లో సరైన కొలతలతో ఎంతో తెలివిగా ఈ చిత్రాన్ని రూపొందించాడనే భావన కలుగుతుంది. మాసినపల్లి రవి పాత్రలో అన్ష్, చిట్టి పాత్రలో వాసవి గణేషన్ ఎంతో సహజంగా నటించారు. ఇద్దరి పెయిర్ కూడా బాగుంది. కొత్తవారైనా రొమాంటిక్ సన్నివేశాల్లో, ఎమోషన్ సీన్స్‌ల్లో కూడా ఎలాంటి తడబాటు లేకుండా పర్‌ఫార్మ్ చేశారు. చిట్టి పాత్ర ఎంతో క్యూట్‌గా అనిపించింది. ముఖ్యంగా ఈ రెండు పాత్రలు యువతను బాగా అలరిస్తాయి. హీరోయిన్ తండ్రి పాత్రలో గోవర్ధన్, హీరో తండ్రి రమేష్‌లు ఆ పాత్రలకు న్యాయం చేశారు. మిగతా ఫ్రెండ్స్ గ్యాంగ్ కావాల్సినంత వినోదాన్ని అందించారు. తొలి చిత్రమైనా దర్శకుడు ఎంతో ఎక్స్‌పీరియన్స్ డైరెక్టర్‌లా ఈ కథను డీల్ చేశాడు. చిన్ని చరణ్ పాటలు, నేపథ్య సంగీతం ఈ చిత్రానికి ప్లస్. డీవోపీ రుద్రసాయి విజువల్స్ కూడా ఎంతో నేచురల్‌గా ఓ గ్రామీణ వాతావరణాన్ని ఆహ్లాదంగా చూపించాయి.

యువతరాన్ని లక్ష్యంగా చేసుకుని తెరకెక్కించిన 'హుషార్ పిట్టలు' చిత్రంలో యువతరానికి నచ్చే అంశాలతో పాటు పరిణతి లేని ఆకర్షణ, ప్రేమల వల్ల జీవితంలో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందో బలంగా చెప్పే ప్రయత్నం చేశారు. తప్పకుండా యువతరానికి నచ్చే సినిమా 'హుషార్ పిట్టలు'



## వంటల షోకు హోస్ట్‌గా సమంత.. 'సెలబ్రిటీ మాస్టర్‌చెఫ్'తో సందడి!

### 'సెలబ్రిటీ మాస్టర్‌చెఫ్ తమిళ్' షోకు హోస్ట్‌గా సమంత
### సోనీలివ్ తమిళ్ ఓటీటీలో ప్రసారం కానున్న కార్యక్రమం
### ఇప్పటివరకు ఇలాంటి షో చేయలేదని వెల్లడించిన సమంత

స్టార్ హీరోయిన్ సమంత సరికొత్త అవతారంలో ప్రేక్షకులను పలకరించేందుకు సిద్ధమయ్యారు. ప్రముఖ వంటల రియాలిటీ షో 'సెలబ్రిటీ మాస్టర్‌చెఫ్' తమిళ వెర్షన్‌కు ఆమె వ్యాఖ్యాతగా వ్యవహరించనున్నారు. ఈ కార్యక్రమం ప్రముఖ ఓటీటీ వేదిక 'సోనీలివ్' తమిళ్‌లో ప్రసారం కానుంది. ఈ విషయాన్ని సోనీ పిక్చర్స్ నెట్‌వర్క్స్ ఇండియా శనివారం అధికారికంగా ప్రకటిస్తూ, షోకు సంబంధించిన ప్రోమో వీడియోను విడుదల చేసింది. బనిజయ్ ఆసియా సంస్థ నిర్మిస్తున్న ఈ షోలో తమిళ చలనచిత్ర, టెలివిజన్ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు పోటీపడనున్నారు. నిత్యం షూటింగ్‌లతో బిజీగా ఉండే ఈ సెలబ్రిటీలు, వంటగదిలో ఎదురయ్యే క్లిష్టమైన సవాళ్లను ఎలా అధిగమిస్తారనేది ఆసక్తికరంగా మారనుంది. అనేక మలుపులతో సాగే ఈ పోటీలో, తమ వంటకాలతో న్యాయనిర్ణేతలను మెప్పించి విజేతగా నిలవాల్సి ఉంటుంది. ఈ షో ప్రసార తేదీని త్వరలోనే ప్రకటిస్తామని నిర్వాహకులు వెల్లడించారు. ఈ కొత్త బాధ్యతపై సమంత స్పందిస్తూ, "నేను ఇప్పటివరకు ఇలాంటి భిన్నమైన షో చేయలేదు, అందుకే ఈ అవకాశం రాగానే వెంటనే అంగీకరించాను. ఈ షో ద్వారా సెలబ్రిటీల సరికొత్త కోణాన్ని చూడవచ్చు. వారు చేసే పొరపాట్లు, తీసుకునే రిస్కులు ప్రేక్షకులకు చాలా ఆసక్తికరంగా అనిపిస్తాయి" అని తెలిపారు. గతంలో 'ది ఫ్యామిలీ మ్యాన్ 2', 'సిటాడెల్: హనీ బన్నీ' వంటి వెబ్ సిరీస్‌లతో ఓటీటీ వేదికగా ప్రేక్షకులను అలరించిన సమంత, ఒక రియాలిటీ షోకు వ్యాఖ్యాతగా వ్యవహరించడం ఇదే మొదటిసారి కావడం గమనార్హం.



# పడిక్కల్ సూపర్ సెంచరీ..
# గాలే టెస్టులో ముగిసిన తొలి రోజు ఆట

శ్రీలంకతో జరుగుతున్న తొలి టెస్టులో భారత యువ బ్యాటర్ దేవదత్ పడిక్కల్ అద్భుత శతకంతో కదం తొక్కాడు. దాదాపు రెండేళ్ల తర్వాత టెస్టు జట్టులోకి వచ్చిన పడిక్కల్ (131 నాటౌట్), తన కెరీర్‌లో తొలి సెంచరీని నమోదు చేశాడు. అతనికి తోడు వైస్ కెప్టెన్ కేఎల్ రాహుల్ (77 రిటైర్డ్ హర్ట్) కూడా రాణించడంతో, శనివారం తొలి రోజు ఆట ముగిసే సమయానికి భారత్ పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. వెలుతురు లేమి, వర్షం కారణంగా ఆటను ముందుగానే నిలిపివేసే సమయానికి టీమిండియా 73 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 288 పరుగులు చేసింది. గాలే అంతర్జాతీయ స్టేడియం వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ బ్యాటింగ్ ఎంచుకున్నాడు. ఓపెనర్లు యశస్వి జైస్వాల్ (32), కేఎల్ రాహుల్ శుభారంభం అందించారు. అయితే, జైస్వాల్ రనౌట్‌గా వెనుదిరిగాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన పడిక్కల్, రాహుల్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను నిలబెట్టాడు. వీరిద్దరూ రెండో వికెట్‌కు కీలక భాగస్వామ్యం నెలకొల్పారు. అయితే, తీవ్రమైన కండరాల నొప్పితో కేఎల్ రాహుల్ రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరగాల్సి వచ్చింది. గాయపడిన సాయి సుదర్శన్ స్థానంలో జట్టులోకి వచ్చిన పడిక్కల్, లభించిన అవకాశాన్ని రెండు చేతులా అందిపుచ్చుకున్నాడు. క్రీజును చక్కగా ఉపయో గించుకుంటూ, అద్భుతమైన ఫుట్‌వర్క్‌తో లంక బౌలర్లను ఎదుర్కొన్నాడు. ముఖ్యంగా బ్యాక్ ఫుట్‌పై ఆకట్టుకునే షాట్లు ఆడాడు. 134 బంతుల్లో తన తొలి టెస్ట్ శతకాన్ని పూర్తి చేసుకున్నాడు. 2002లో సౌరవ్ గంగూలీ తర్వాత భారత జట్టులో మూడో స్థానంలో టెస్టు శతకం సాధించిన తొలి ఎడమచేతి వాటం బ్యాటర్‌గా పడిక్కల్ రికార్డు సృష్టించాడు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (16) ఎక్కువసేపు నిలవలేకపోయాడు. స్పిన్నర్ ప్రభాత్ జయసూర్య బౌలింగ్‌లో అనవసర షాట్‌కు యత్నించి మిడ్-ఆఫ్‌కు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. అనంతరం క్రీజులోకి వచ్చిన రిషభ్ పంత్ (27 నాటౌట్) తనదైన శైలిలో దూకుడుగా ఆడాడు. పడిక్కల్‌తో కలిసి అజేయంగా 52 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. వర్షం కారణంగా ఆట కాసేపు నిలిచిపోయినా, బ్యాటర్ల జోరు తగ్గలేదు. అయితే, వెలుతురు మందగించడంతో అంపైర్లు తొలి రోజు ఆటను 17 ఓవర్లు ముందుగానే ముగించారు. పడిక్కల్ 178 బంతుల్లో 12 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 131 పరుగులు, పంత్ 36 బంతుల్లో 3 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 27 పరుగులతో క్రీజులో ఉన్నారు. రెండో రోజు ఆట 15 నిమిషాలు ముందుగా ప్రారంభం కానుండగా, భారత్ 500 పైచిలుకు స్కోరుపై కన్నేసింది.




(131 నాటౌట్)



## ఒక్క పోస్ట్.. భారత క్రికెట్‌లో ముగిసిన ఒక స్వర్ణయుగం.. ధోనీ వీడ్కోలుకు ఆరేళ్లు!

భారత క్రికెట్ చరిత్రలో అదొక మరపురాని రోజు. దేశమంతా స్వాతంత్ర్య దినోత్సవ సంబరాల్లో మునిగి తేలుతున్న వేళ, ఒక శకం ముగిసింది. సరిగ్గా ఆరేళ్ల క్రితం 2020 ఆగస్ట్ 15న రాత్రి 7:29 గంటలకు.. భారత క్రికెట్‌ను శాసించిన, అత్యంత ప్రభావవంతమైన ఆటగాళ్లలో ఒకడైన మహేంద్ర సింగ్ ధోనీ తన 15 ఏళ్ల అద్భుతమైన అంతర్జాతీయ కెరీర్‌కు వీడ్కోలు పలికాడు. ఎలాంటి మీడియా సమావేశం లేదు, సుదీర్ఘ ప్రసంగాలు లేవు, ఆర్భాటాలు అసలే లేవు. తనకు మాత్రమే సాధ్యమైన రీతిలో అత్యంత నిశ్శబ్దంగా ధోనీ ఈ సంచలన నిర్ణయాన్ని ప్రకటించాడు. తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో, తన క్రికెట్ ప్రయాణంలోని మధురమైన చిత్రాలతో కూడిన ఒక వీడియోను పంచుకున్నాడు. ఆ వీడియో నేపథ్యంలోని 'మై పల్ దో పల్ కా షాయర్ హూన్' అనే ముకేశ్ పాట, అతని వీడ్కోలు భావనకు అద్దం పట్టింది. "ఇన్నాళ్లు మీరు చూపిన ప్రేమ, మద్దతుకు ధన్యవాదాలు. ఈ రోజు రాత్రి 7:29 గంటల నుంచి నన్ను రిటైర్ అయిన వ్యక్తిగా పరిగణించండి" అని క్లుప్తంగా రాసుకొచ్చాడు. అంతే.. ఒక్క పోస్ట్‌తో భారత క్రికెట్‌లో ఒక స్వర్ణయుగం ముగిసిపోయింది. నాయకత్వానికి కొత్త అర్థం చెప్పిన, ఒత్తిడిలో మ్యాచ్‌లను ముగించడంలో తనకు తానే సాటి అని నిరూపించుకున్న ఒక గొప్ప యోధుడు మైదానం నుంచి అలా నిష్క్రమించాడు. 2004లో అంతర్జాతీయ క్రికెట్‌లో అడుగుపెట్టిన ధోనీ, ఆ తర్వాత చరిత్ర సృష్టించాడు. మూడు ప్రధాన ఐసీసీ ట్రోఫీలు (టీ20 ప్రపంచకప్, వన్డే ప్రపంచకప్, ఛాంపియన్స్ ట్రోఫీ) గెలిచిన ప్రపంచంలోని ఏకైక కెప్టెన్‌గా రికార్డు సృష్టించాడు. 2007లో తొలి టీ20 ప్రపంచకప్‌ను యువ జట్టుతో గెలిచి సంచలనం సృష్టించాడు. ఆ తర్వాత 2011లో వాంఖడే స్టేడియంలో సిక్సర్‌తో వన్డే ప్రపంచకప్‌ను అందించి భారతీయుల 28 ఏళ్ల నిరీక్షణకు తెరదించాడు. 2013లో ఛాంపియన్స్ ట్రోఫీ గెలుపుతో అతని కెప్టెన్సీ ప్రస్థానం పరిపూర్ణమైంది. ఆటగాడిగానూ ధోనీ గణాంకాలు అద్భుతం. 350 వన్డేల్లో 10,773 పరుగులు, 90 టెస్టుల్లో 4,876 పరుగులు చేశాడు. 98 టీ20 మ్యాచ్‌లలోనూ భారత్‌కు ప్రాతినిధ్యం వహించాడు. వికెట్ల వెనుక అతడి చురుకుదనానికి 829 అంతర్జాతీయ డిస్మిసల్స్ నిదర్శనం.

సూర్య వాస్తవం
http://www.suryavastavam.in



# మతోన్మాదులను, వేర్పాటు వాదులను వ్యతిరేకించండి

**ప్రజా స్వామ్యాన్ని పరిరక్షించుకుందాం : కామనురు శ్రీనివాసులురెడ్డి**





**కడప –సూర్య వాస్తవం :** రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్యం, లౌకికవాదం మరియు సామాజిక న్యాయాన్ని కాపాడుకోవడానికి పౌరులందరూ ఐక్యంగా నిలవాలని, దేశాన్ని విచ్ఛిన్నం చేసే మతోన్మాదులను, వేర్పాటువాదులను మరియు హింసావాదులను వ్యతిరేకించాలని వివిధ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు పిలుపునిచ్చారు. 80వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం కడప నగరంలోని స్థానిక 7 రోడ్ల కూడలి వద్ద జమియతుల్ ఉలమా ఏ హింద్ ఆధ్వర్యంలో జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కామనురు శ్రీనివాసులురెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి జమియతుల్ ఉలమా ఏ హింద్ అధ్యక్షులు ముఫ్తీ రహమతుల్లా ఖాన్ అధ్యక్షత వహించారు.

**ఈ సందర్భంగా నాయకులు వెల్లడించిన ముఖ్య అంశాలు:**

రాజ్యాంగ పరిరక్షణ ఒ మతోన్మాద వ్యతిరేకత: ప్రజాస్వామ్యం, లౌకికవాదం మరియు సమానత్వంపై దాడి చేస్తున్న మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా ప్రజల ఐక్యతను బలోపేతం చేయాలని కామనురు శ్రీనివాసులురెడ్డి స్పష్టం చేశారు. ఐక్యతా వేడుకలు: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రజాసంఘాలు, పార్టీల భాగస్వామ్యంతో జాతీయ జెండాను ఎగురవేసి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. సామాజిక సమరసత: వివిధ వర్గాల మధ్య సోదరభావాన్ని, శాంతియుత సహజీవనాన్ని పెంపొందించడానికి 'సద్భావన' వేదికలను బలోపేతం చేయాలని ముఫ్తీ రహమతుల్లా ఖాన్ కోరారు. నైతిక విలువలు ఒ సామాజిక బాధ్యత: ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ నగర అధ్యక్షులు షేక్ కలీమ్ మాట్లాడుతూ యువతలో పెరుగుతున్న సామాజిక రుగ్మతలను అరికట్టేలా నైతిక అవగాహన కల్పించాలని, పేదరికం, నిరక్షరాస్యత నిర్మూలనకు మానవతా దృక్పథంతో ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ అధ్యక్ష, కార్యదర్శులు సి.పి. రమణ, నరసింహ, జమాత్ ఎ ఇస్లామీ హింద్ బాధ్యులు, కమురుద్దీన్ ,వివిధ ప్రజాసంఘాల ప్రతినిధులు మరియు నగర కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీ దేశ ప్రధాని కావాలి

**--అజ్మీర్ షరీఫ్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేసిన ఏపీపిసిసి జనరల్ సెక్రెటరీ షేక్ అల్లాబకష్**



**రాయచోటి – సూర్య వాస్తవం:** భారతదేశంలోని రాజస్థాన్ రాష్ట్రం,అజ్మీర్ నగరంలో వెలసిన ప్రఖ్యాత ఖ్వాజా గరీబ్ నవాజ్ దర్గా (అజ్మీర్ షరీఫ్)దర్గాను శనివారం ఏపీపీసీసీ జనరల్ సెక్రెటరీ షేక్ అల్లా బకష్ (సీఎల్పీ) సందర్శించి ప్రత్యేకంగా ప్రార్థనలు (దువా) చేశారని, భారతదేశంలో ప్రజలు అనేక సమస్యలు ఎదు ర్కొంటున్నారని, కేంద్రంలో మోడీ అందిస్తున్న ప్రజా వ్యతిరేక పాలనకు స్వస్తి పలకాలని,దేశానికి పట్టిన శని గ్రహాన్ని పారద్రోలి భారతదేశానికి జాతీయ కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకు డు, పార్లమెంట్ సభ్యుడు రాహుల్ గాంధీని ప్రధాని కావాలని మనస్ఫూర్తిగా వేడుకున్నట్లు అల్లాబకష్ తన వాట్సాప్ ద్వారా సమాచారాన్ని తెలిపారు. ఈ ప్రత్యేక ప్రార్థనలో ఏపీకి చెందినవారు చాలామంది పాల్గొన్నట్లు తెలిపారు.

# కాంగ్రెస్ పార్టీ కార్యాలయంపై రెపరెపలాడిన జాతీయ జెండా

**- జాతీయ జెండా ఎగురవేసిన ఏఐసిసి సభ్యుడు, నియోజకవర్గ ఇన్‌ఛార్జిలు**



**రాయచోటి–సూర్య వాస్తవం:** ఎందరో మహానుభావుల ప్రాణత్యాగాలు, పోరాటాల ఫలితమే 1947 ఆగస్టు 15న మనకు లభించిన స్వాతంత్య్ర దినోత్సవం అని ఏఐసిసి సభ్యుడు అజ్మతుల్లా, రాయచోటి అసెంబ్లీ రీఛార్జ్ ఆర్. అమీర్ బాష అన్నారు. ఆగస్టు 15 80 స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంపై జాతీయ జెండాను వారు ఎగురవేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్రిటీష్ వారి దాస్య శృంఖలాలను తెంచుకోవడానికి ఎంతో మంది నాయకులు, వీరులు తమ సర్వస్వాన్ని కోల్పోయారని గుర్తుచేశారు. స్వాతంత్య్ర పోరాట ముఖ్యాంశాలురెండు శతాబ్దాల బ్రిటీష్ పాలన అంతం.మహాత్మా గాంధీ శాంతియుత ఉద్యమాలు (సహకార, ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా).భగత్ సింగ్, సుభాష్ చంద్రబోస్, రాజగురు వంటి విప్లవ వీరులపోరాటాలు.అల్లూరిసీతారామరాజు, కోమరం భీమ్ వంటి తెలుగు ప్రాంత యోధుల త్యాగాల గురించి వారు కొనియాడారు.ఈ కార్యక్రమంలో డీసీసీ వైస్ ప్రెసిడెంట్ షేక్ అమీర్ బాష, సెక్రటరీ యస్ ఎండీ రఫీక్, పట్టణ అధ్యక్షుడు బాబ సర్దార్, రాయచోటి నాయకులు ఖాదర్ ఖాన్, మస్తాన్, నాగముని రెడ్డి, నూరూల్లా, రియాజ్, స్వానాజారెడ్డి, ఇర్షాద్, ముష్టాక్, షైక్ రియాజ్, ఇమ్రాన్, అజమతుల్లా మహమ్మద్ బాష, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కరెంట్ ప్రమాదంలో పూరి గుడిసె దగ్ధం

**- బాధితులను పరామర్శించిన సీపీఎం నాయకులు**



**బ్రహ్మంగారిమఠం– సూర్య వాస్తవం:** మండల కేంద్రంలోని జింకలనగర్‌లో విద్యుత్ ప్రమాదంతో పూరి గుడిసె దగ్ధమైంది. గ్యాస్ సిలిండర్ పేలడంతో మంటలు చెలరేగి గుడిసె పూర్తిగా కాలిపోయింది. సగిలి బాలరాజు, ఆయన భార్య మరియమ్మ నివాసముంటున్న గుడిసెలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదంలో ఆధార్, రేషన్ కార్డులు, బట్టలు, బాండ్లు, బీరువా, టీవీతో పాటు ఇంటి సామగ్రి పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది ఫైర్ ఇంజన్‌తో మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ప్రమాద సమయంలో బాలరాజు, మరియమ్మ పనులకు వెళ్లడంతో ఇంట్లోని సామగ్రిని బయటకు తీసే అవకాశం లేకుండా పోయింది. కట్టుబట్టలతోనే మిగిలామని, తమను ఆదుకుని న్యాయం చేయాలని బాధితులు వేడుకుంటున్నారు. విషయం తెలుసుకున్న సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జి. శివకుమార్, మండల కమిటీ సభ్యులు హరి, గురయ్య బాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జింకలనగర్‌లో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని ఆరోపించారు. గతంలో ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించడంతో దూర ప్రాంతం నుంచి విద్యుత్ కనెక్షన్ తీసుకోవాల్సి వచ్చిందన్నారు. వైరు దెబ్బతినడంతోనే ప్రమాదం జరిగినట్లు తెలిపారు. విద్యుత్ స్తంభాల తొలగింపు, కొత్త స్తంభాల ఏర్పాటులో అధికారుల నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమని ఆరోపించారు. స్థానిక ఎమ్మెల్యే సైతం పలుమార్లు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని సూచించినప్పటికీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని మండిపడ్డారు. బాధిత కుటుంబానికి తక్షణమే ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి, ఇల్లు నిర్మించి ఇవ్వాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు.

# మొక్కలు నాటిన మెగా అభిమానులు



**ప్రొద్దుటూరు – సూర్య వాస్తవం:** పద్మభూషణ్, డాక్టర్ మెగాస్టార్, చిరంజీవి జన్మదిన వారోత్స వాలులో భాగంగా శనివారం శ్రీ వీరబ్రహ్మేంద్ర ఆశ్రమం ఫౌండర్ సుబ్బరాయుడు పాల్గొని మొక్కలు నాటినారు. ఆయన మాట్లాడుతూ చిరంజీవి జన్మదిన వారోత్సవాలను నేను మొదలుపెట్టడం చాలా ఆనందంగా ఉంది ఈ వారోత్సవాల్లో భాగంగా ఈరోజు నేను పాల్గొనడం చాలా సంతోషంగా ఉంది ఇటువంటి మెగా అభిమానులు ఉండడం చిరంజీవి చాలా అదృష్టవంతుడు ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో బాగుండాలని మనసారా కోరుకుంటున్నాను అన్నారు . జనసేన పార్టీ నాయకులు బొల్లారం వెంకటేశ్వర స్వామి టెంపుల్ బోర్డ్ మెంబర్ రామోజీ ప్రసాద్ మాట్లాడుతూ చిరంజీవి పుట్టినరోజు సేవా తత్పరత దినోత్సవం గా ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వం వారిని నేను కోరుకుంటున్నాను సినీ నటులు అభిమానుల్ని ఘనత ప్రపంచ సిమిజగతులు చిరంజీవికి మాత్రమే దక్కుతుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో మెగా అభిమానులు, పట్టణ చిరంజీవి యువత అధ్యక్షుడు రామారావు, షరీఫ్ టైర్స్, సాగర్, బియ్యం కేశవ ,రాము, నాయబ్, నంద మెగా శ్యామ్ , బాబు రావు, మధు ,చెన్న రవి, పాల్గొన్నారు.

# ఎవరూ లేని వ్యక్తికి చివరి వీడ్కోలు పలికిన మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్



**ప్రొద్దుటూరు – సూర్య వాస్తవం:** గుర్తు తెలియని వ్యక్తి ఎర్రగుంట్ల రైల్వే స్టేషను ప్లాట్ ఫారం నందు అనారోగ్యం చేత మరణించగా అంతిమ సంస్కరణలు చేయడానికి బందువులు ఎవరు ముందుకు రాకపోవడంతో ప్రొద్దుటూరు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి పోలీస్ సిబ్బంది ఫోన్ ద్వారా మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ టౌన్ ప్రెసిడెంట్ సుబహాన్ ను సంప్రదించగా వారు వెంటనే స్పందించి శనివారం హిందు స్మశాన వాటికలో హిందూ సంప్రదాయం ప్రకారంగా అంతిమ సంస్కరణలు నిర్వహించారు. ఇటువంటి గొప్ప కార్యక్రమానికి చేయూత అందించిన ఫౌండేషన్ చైర్మన్ మోరే లక్ష్మణ్ రావు, టౌన్ ప్రెసిడెంట్ సుబాహన్, సతీష్ , రసూల్ పాల్గొని అంత్యక్రియలను పూర్తి చేశారు. చైర్మన్ మోరే లక్ష్మణ్ రావు మాట్లాడుతూ సమాజంలో ఎవరూ లేని వారికి కూడా గౌరవ ప్రదమైన అంతిమ సంస్కారాలు జరగాలని ఉద్దేశంతో ఈ సేవా కార్యక్రమం చేపట్టా మని వారు తెలిపారు. మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ నిరంతరం ఇలాంటి సేవా కార్య క్రమాలు చేపడుతూ, అవసరంలో ఉన్న వారికి అండగా నిలుస్తుందని ఫౌండేషన్ సభ్య లు పేర్కొన్నారు. మా శ్రీ అమ్మ శరణాలయం లోని వృద్ధులకు సహాయం చేయద లచిన ఎవరైనా దాతలు ఉంటే ఈ నెంబర్లను సంప్రదించ వలసిందిగా కోరారు. 82972 53484, 9182244150.

# దేశానికి విజ్ఞులైన పౌరులు అవసరం

**-జనసేన పార్టీ నాయకుడు ఆడిటర్ మన్సూర్ అలీ ఖాన్**



**రాయచోటి–సూర్య వాస్తవం:** ఆగస్టు 15 స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా జనసేన పార్టీ రాయచోటి నియోజకవర్గం నాయకుడు ఆడిటర్ మన్సూర్ అలీ ఖాన్ తో శనివారం 'సూర్య వాస్తవం' ప్రతినిధి కలిసిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్య్ర సమర యోధులు, దేశాన్ని కాపాడినతరాలుఅందించిన సేవలను ఆయన కొనియా డారు.యువతకు పిలుపు ప్రజాస్వామ్యంపై వ్యాఖ్యలుసమాజంలో వేగంగా వస్తున్న సాంకేతికత కారణంగా సమాచారం అందుబాటులోకి వస్తోందని, అయితే వేగమే నిజంకాదని ఆయన అన్నారు. దేశానికి గుడ్డి అనుచరులు కాకుండా, ఆలోచించిప్రశ్నించే విజ్ఞులైన పౌరులు అవసరం ఎంతైనా ఉందని ఆయన చెప్పారు. ప్రజావ్యవస్థలలో ఏవైనా లోపాలు ఉంటే వాటిని సరిదిద్దే ప్రయత్నం చేయాలి తప్ప, వ్యవస్థనే ధ్వంసం చేసేలా ప్రవర్తించకూడదని హితవు పలికారు. స్వాతంత్య్రం కేవలం హక్కులనే కాకుండా బాధ్యతలను కూడా నేర్పిస్తుందని, ఆ స్వేచ్ఛను సమాజ శ్రేయస్సు కోసం వాడాలని సూచించారు.

# ఉత్తమ విధులకు ప్రశంసా పత్రం అందుకున్న డీఎస్పీ కృష్ణ మోహన్



**అన్నమయ్య బ్యూరో – సూర్య వాస్తవం:** 80వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని అన్నమయ్య జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఉత్తమ విధులు నిర్వ హించిన పోలీసు అధికా రులు, సిబ్బందిని ప్రశంసిస్తూ ప్రశంసా పత్రాలు అంద జేశారు. ఈ సందర్భంగా రాయచోటి డివిజన్ డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్న డీఎస్పీ కృష్ణ మోహన్ ఉత్తమ సేవలకు గుర్తింపుగా అన్నమయ్య జిల్లా మదనపల్లె పరేడ్ మైదానంలో జిల్లా ఎస్పీ దీరజ్ కునుబిల్లి చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు.ఈ సందర్భంగా డీఎస్పీ కృష్ణ మోహన్ మాట్లాడుతూ, 80వ స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా అన్నమయ్య జిల్లా పోలీస్ శాఖ అందించిన ప్రశంసా పత్రాన్ని అందు కోవడం ఎంతో గర్వంగా ఉంద న్నారు. ఈ గౌరవాన్ని తన సేవా ప్రయాణంలో మరింత అంకితభావంతో, బాధ్యతా యుతంగా విధులు నిర్వహించేందుకు ప్రేరణగా స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందిస్తూ, పోలీస్ శాఖ ప్రతిష్ఠను మరింత పెంచేలా కృషి చేస్తానని డీఎస్పీ కృష్ణ మోహన్ పేర్కొన్నారు. ఉత్తమ విధులకు లభించిన ఈ గుర్తింపు పోలీసు సిబ్బందిలో మరింత ఉత్సాహాన్ని, సేవా స్ఫూర్తిని నింపుతుందని అధికారులు తెలిపారు.

# నక్కలదిన్నె పిహెచ్‌సి డాక్టర్ పి.ఓబులేసు ప్రతిభకు జిల్లా అవార్డు.



**చాపాడు – సూర్య వాస్తవం:** మండలంలోని నక్కలదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారిగా విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ పి.ఓబులేసు కి కడప జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.యుగంధర్ చేతుల మీదుగా 80వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ఓబులేసు మాట్లాడుతూ ముఖ్యంగా జిల్లాలో నక్కలదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అన్ని జాతీయ కార్యక్రమాలలో ప్రథమ స్థానంలో మరి ముఖ్యంగా యన్ సి డి సి డి, ఆర్ బి ఎస్ కె, ఎన్‌విబిడి సి పి, వ్యాధినిరోధక టీకాలను నిర్వహించడంలో పాఠశాల ఆరోగ్య విషయంలో, డిపిటి, యం ఆర్, అలాగే నక్కలదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉండే అన్ని గ్రామాల ప్రజలకు వైద్య సేవలు, చికిత్సలు, అందుతున్న తీరు ను, కార్యక్రమంలో జిల్లాలో నక్కలదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మొదటి స్థానంలో వచ్చేదానికి కృషి చేసి సఫలీకృతం చేసిన డాక్టర్ పి.ఓబులేసు ని అవార్డుకు ఎంపిక చేసి డియం హెచ్ ఓ డాక్టర్ పి.యుగంధర్ చేతులమీదుగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా నక్కల దిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న డాక్టరు కావ్య మాధురి,ఆరోగ్య విస్తరణ అధికారి యం.రాఘవయ్య, డిప్యూటి హెచ్ ఈ ఓ జయ ప్రకాశ్, సూపర్ వైజర్స్ ప్రసాద్ భవానీ, సీనియర్ అసిస్టెంట్ బాబు, యం ఎల్ హెచ్ పి లు, ఎ ఎన్ యం లు, ఆశా కార్యకర్తలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని ప్రజలు డాక్టర్ పి.ఓబులేసు కి అవార్డు రావడం పట్ల సంతోషం వ్యక్తం చేసి శుభాకాంక్షలు, అభినందనలు తెలియజేశారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS ADDRESS : # DOOR NO-4-29-A-19-12-, DONTHI STREET, MADANAPALLI, ANNAMAYYA, CHITTOOR, ANDHRA PRADESH - 517325. CELL : 9885404140 ( ASSOCIATE EDITOR -Mohammad Shafi Ahamad 9948461699 )

## నేషనల్ హ్యూమన్ రైట్స్ యాంటీ కరప్షన్ అండ్ యాంటీ క్రైమ్ బ్యూరో ఆఫ్ ఇండియా

# కడప జిల్లా కమిటీ ఏర్పాటు



**ప్రొద్దుటూరు – సూర్య వాస్తవం:** నేషనల్ హ్యూమన్ రైట్స్ యాంటీ కరప్షన్ అండ్ యాంటీ క్రైమ్ బ్యూరో ఆఫ్ ఇండియా సంస్థ నేషనల్ ప్రెసిడెంట్ డాక్టర్ కె.ఎస్. జ్యోతిశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు, సంస్థ నేషనల్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఆరికొండ ప్రతాప్ కుమార్ ఆధ్వర్యంలో కడప జిల్లా కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కడప జిల్లా కమిటీలో ఎర్రగుంట్లకు చెందిన బేరి రామయ్యను జిల్లా ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్‌గా, ప్రొద్దుటూరుకు చెందిన బిర్రు సురేష్‌ను జిల్లా వైస్ ప్రెసిడెంట్‌గా, గంగారపు రవి కిరణ్ బాబును జిల్లా అదనపు వైస్ ప్రెసిడెంట్‌గా, దువ్వూరు మండలం మాచనపల్లికి చెందిన నొస్సం రమేష్‌ను జిల్లా జాయింట్ సెక్రటరీగా నియమించినట్లు డాక్టర్ ఆరికొండ ప్రతాప్ కుమార్ వెల్లడించారు. ఈ సందర్భంగా నూతనంగా జిల్లా స్థాయి కార్యనిర్వాహక బాధ్యతలు స్వీకరించిన సభ్యులు మాట్లాడుతూ, సంస్థ తమపై అప్పగించిన బాధ్యతలను అత్యంత జాగ్రత్తగా, నిబద్ధతతో నిర్వహిస్తామని తెలిపారు. ఎక్కడ న్యాయం ఉండి అన్యాయం జరుగుతుందో అక్కడ బాధితులు, పేద ప్రజల పక్షాన నిలబడి సంస్థ తరఫున న్యాయం కోసం పోరాడుతామని పేర్కొన్నారు. జిల్లాలో మానవ హక్కుల పరిరక్షణ, అవినీతి మరియు నేరాల నియంత్రణకు సంబంధించి ప్రజల్లో అవగాహన కల్పిస్తూ, బాధితులకు న్యాయం జరిగేలా తమ వంతు కృషి చేస్తామని నూతన కమిటీ సభ్యులు తెలిపారు. తమకు జిల్లా స్థాయిలో బాధ్యతలు అప్పగించిన నేషనల్ ప్రెసిడెంట్ డాక్టర్ కె.ఎస్. జ్యోతిశ్వర్ రెడ్డి, నేషనల్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఆరికొండ ప్రతాప్ కుమార్లకు నూతనంగా నియమితులైన జిల్లా కార్యనిర్వాహక సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# పరస కస్తూరిమ్మ 6వ వర్థంతి సంస్మరణ సభ

**- ఉచిత మెగా మెడికల్ క్యాంప్‌ను జయప్రదం చేయండి**

**- మాజీ మంత్రి పరసారత్నం"**

**దొరవారిసత్రం– సూర్య వాస్తవం :** పరస కస్తూరమ్మ 6వ వర్ధంతి సంస్కరణ సభ మరియు ఉచిత మెగా మెడికల్ క్యాంపు ను ప్రతి ఒక్కరూ ఉపయోగించుకొని జయప్రదం చేయాలని మాజీ మంత్రి పరసారత్నం శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన కార్యక్రమాలు వివరాలు తెలుపుతూ.తేదీ అండ్ సమయం, 16-08-2026, ఆదివారం,ఉదయం 9 గంటలకు వేదిక తిరుపతి,సిమ్స్ ఎదురుగా గల మున్సిపల్ హై స్కూల్ గ్రౌండ్"కార్యక్రమ వివరాలు":

1.పరస కస్తూరి 6వ వర్ధంతి సంస్మరణ సభ
2.ఉచిత మెగా మెడికల్ క్యాంప్
3.ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్ట్
4. రక్తదాన శిబిరం

కరోనా సమయంలో అకాల మరణం పొందిన తన సతీమణి పరస కస్తూరి మ్మ జ్ఞాపకార్థం,తిరుపతి జిల్లాలోని పేద ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించాలనే సంకల్పంతో ఈ క్యాంప్ ఏర్పాటు చేస్తున్నట్లు పరసారత్నం తెలిపారు. మం త్రులు, ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు,పలు కార్పొరేట్ హాస్పిటల్స్ ఈ కార్యక్రమంలో పాల్గొంటారు.జిల్లా ప్రజలందరూ ఈ గొప్ప అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మాజీ మంత్రి పరసారత్నం విజ్ఞప్తి చేశారు.

# పాఠశాలలో ఖాళీలు పోస్టులకు దరఖాస్తు చేసుకోండి..

**- ఎంఈఓ కొండయ్య**

**దొరవారిసత్రం– సూర్య వాస్తవం :** దొరవారిసత్రం మండల పరిధిలో గల వివిధ పాఠశాలలో ఖాళీగా ఉన్న పోస్టులకు దరఖాస్తు చేసుకోండి అంటూ కొండయ్య అన్నారు.ఆయన శనివారం తెలుపుతూ,దొరవారిసత్రం మండలం నందు గల పాఠశాలలో అకడమిక్ ఇన్ స్ట్రక్చర్స్ పోస్టులు ఎస్ జి టి-45,ఎస్ ఏ పి ఎస్-అండ్ బిఎస్ -1,ఖాళీలు ఉన్నాయి.స్తానికతకు మొదటి ప్రాధాన్యత, (మండలం,నియర్ బై మండలం)అర్హత (టీటీసీ/డీఈడీ,బిఈడి )కలిగిన వాళ్ళు 21-8-26 తేదిలోపు మండల మండల విద్యాశాఖ కార్యాలయం నందు అప్లికేషన్స్ సమర్పిచవలెనని మండల విద్యాశాఖాధికారి-1,కోలా కొండయ్య తెలిపారు.

# ఫార్మసిస్ట్ కు జిల్లాస్థాయిలో ఉత్తమ సేవ పురస్కారం

**దొరవారిసత్రం– సూర్య వాస్తవం :** దొరవారిసత్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గత నాలుగు ఏళ్లుగా ఫార్మాసిస్ట్ సేవలందించి పామంజి. మమత అటు ప్రభుత్వ అధికారుల నుండి,ఇటు తన విధులలో నాణ్యమైన సేవలందించిన ఆమెకు జిల్లాస్థాయి ఉత్తమ ఫార్మసిస్ట్ ఎంపిక కావడం హర్షించదగ్గ విషయం. శనివారం దేశవ్యాప్తంగా నిర్వ హించిన 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా తిరుపతి జిల్లా వైద్య కేంద్రంలో నిర్వహించిన స్వాతంత్ర దినం వేడుకలో



ప్రశంసా పత్రం తో సత్కరించారు.విధుల్లో సమయపాలన, ప్రజారోగ్యంలో ప్రజలకు అవసరమైన ఔషధాలను అందించి గుర్తింపు పొందారు.అంతేకాకుండా ప్రభుత్వం పనిచేస్తున్న సిబ్బంది పనితీరు పరిశీలనకు నిర్వహించిన ఐవి ఆర్ ఎస్ కాల్స్ లో కూడా ప్రజల అభిప్రాయం పాజిటివ్ గా రావడంతో జిల్లాస్థాయి పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా పి హెచ్ సి డాక్టర్స్,చైతన్య,చంద్రకళ, తోటి సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

# రక్తదానం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత..మాభాష

**- చిరంజీవి సేవా స్ఫూర్తితో 15 ఏళ్లుగా సేవా కార్యక్రమాలు**



**దొరవారిసత్రం -సూర్య వాస్తవం :** మనం సిరాతో రాసే అక్షరం కాగితానికే పరిమితం కావచ్చు..కానీ దానంగా ఇచ్చే రక్తబొట్టు మరొకరికి నూరేళ్ల ఆయుష్షునిస్తుంది"అని చిరంజీవి సేవా సంఘం అధ్యక్షులు మాభాష స్పష్టం చేశారు.స్వాతంత్ర దినోత్సవం, డాక్టర్ పద్మభూషణ్ చిరంజీవి గారి జన్మదినోత్సవ వారోత్సవాల సందర్భంగా తిరుపతి జిల్లా సూళ్ళూరుపేట పట్టణంలో చిరంజీవి సేవా సంఘం ఆధ్వర్యంలో,రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ సహకారంతో శనివారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరం అత్యంత వైభవంగా జరిగింది.ఈ సందర్భంగా మాభాష మాట్లాడుతూ,నాటి స్వాతంత్ర సమరయోధుల ప్రాణ త్యాగాల ఫలంగానే నేడు మనమందరం స్వేచ్ఛావాయువులు పీలుస్తున్నామని,ఆ మహనీయుల త్యాగాలను స్మరించుకోవడం మనందరి కనీస ధర్మమని తెలిపారు.మెగాస్టార్ చిరంజీవి సేవా స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని గత 15 సంవత్సరాలుగా ఆగస్టు 15న క్రమం తప్పకుండా ఈ రక్తదాన శిబిరాన్ని దిగ్విజయంగా నిర్వహిస్తున్నామని వివరించారు. ఆపదలో ఉన్న వారికి, అత్యవసర సమయాల్లో రక్తం అందక ఏ ఒక్కరూ ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతోనే తమ సంఘం నిరంతరం శ్రమిస్తోందని పేర్కొన్నారు.ఎవరికి ఎక్కడ రక్తం కావలసి వచ్చినా తమ చిరంజీవి సేవా సంఘాన్ని సంప్రదిస్తే వెంటనే స్పందించి రక్తాన్ని అందజేస్తామని హామీ ఇచ్చారు.
ఈ శిబిరంలో మెగా అభిమానులు,పట్టణ ప్రజలు, జనసె నికులు విశేషంగా పాల్గొని 53 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేయడం అభినందనీయమని కొనియాడారు.రక్తం ఇచ్చి ప్రాణదాతలుగా నిలిచిన ప్రతి ఒక్కరికీ ఆయన పేరుపేరునా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమం లో జనసేన పార్టీ నాయకులు హరిబాబు, కోటియాదవ్, దాసు,రాజా, రామ్మూర్తి,రంజిత్,కిరణ్,వీర మహిళలు పద్మజ, సుజాత,బిజెపి పార్టీ నాయకురాలు బెజవాడ విజయమ్మ, సిపిఎం పార్టీ నాయకులు షేక్ రియాజ్, రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ సిబ్బంది,చిరంజీవి సేవా సంఘం ప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో అభిమానులు పాల్గొన్నారు.

# ఘనంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకలు

**బ్రహ్మంగారిమఠం - సూర్య వాస్తవం :**మండల కేంద్రంలోని బ్రైట్ మైండ్ స్కూల్లో స్వాతంత్ర దినోత్సవం వేడుకలు కరస్పాండెంట్ శిల్ప ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.
విద్యార్థినీ విద్యార్థులు ఉపాధ్యాయిని ఉపాధ్యాయులతో కలిసి త్రివర్ణ జెండా ను



ఎగరవేసి జెండా వందనం నిర్వహించారు. జాతీయ గీతాన్ని ఆలపించారు. పలు సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. ఆటల పోటీలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెడ్మాస్టర్ ఆది తదితరులు ఉన్నారు.

**ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లో...**

**- జెండా ఎగురవేసిన ట్రాఫిక్ సీఐ చాంద్ భాషా**



**రాయచోటి– సూర్య వాస్తవం :** రాయచోటి పట్టణంలోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ లో శనివారం 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. జాతీయ జెండాను ఎగురవేసి, గౌరవ సెల్యూట్ చేసి జనగణమన అధినాయక జయహే గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమరయోధుల స్ఫూర్తితో పోలీసులు అంకితభావం, నిజాయితీతో మెరుగైన ప్రజాసేవ చేయాలని కోరారు. పిలుపునిచ్చారు. అనంతరం సిబ్బందికి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసులు సిబ్బంది పాల్గొన్నారు.

**అన్నమయ్య బ్యూరో– సూర్య వాస్తవం**

మదనపల్లి చారిత్రాత్మక బీటీ కాలేజ్ గ్రౌండులో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు అత్యంత ఘనంగా, కన్నుల పండువగా జరిగాయి.
ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర రవాణా, యువజన మరియు క్రీడల శాఖ మంత్రి, అన్నమయ్య జిల్లా ఇన్‌చార్జి మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. రైతులు, మహిళలు, యువత, దివ్యాంగులు సహా అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. వేడుకల్లో భాగంగా పోలీసు, వివిధ శాఖల ప్లాటూన్ల మార్చ్‌ఫాస్ట్, పోలీసు జాగిలాల విన్యాసాలు, అగ్నిమాపక శాఖ ప్రదర్శనలు, వివిధ ప్రభుత్వ శాఖల ప్రగతి శకటాలు, విద్యార్థుల దేశభక్తి, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

**బెంగళూరులో..** స్థానిక జిఎం పాళ్యలోని సత్యదేవ రెసిడెన్సీ అసోసియేషన్ ఆధ్వర్యంలో 80 వ స్వాతంత్ర్య సంబరాలు శనివారం ఘనంగా నిర్వహించబడ్డాయి.

**ప్రొద్దుటూరులో..** 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని



పురస్కరించుకుని ప్రొద్దుటూరు గాంధీ రోడ్డులోని గాంధీజీ విగ్రహం వద్ద మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

**ముద్దనూరులో..** మండల కేంద్రము అయిన ముద్దనూరు వ్యవసాయ సహాయ సంచాలకులు (ఎడిఏ) కార్యాలయంలో 80 వ స్వాతంత్ర్య దినోత్సవం వేడుకల్లో భాగంగా ఎడి ఏ కె రామ మోహన్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి మారెడ్డి వెంకట క్రిష్ణారెడ్డి జాతీయ జెండాను ఎగురవేశారు.

**జమ్మలమడుగు లో..** స్వాతంత్ర సమరయోధుల సేవలను చిరస్మరణీయంగా ప్రతి ఒక్కరు గుర్తు పెట్టుకోవాలని రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ మారెడ్డి వెంకట క్రిష్ణారెడ్డి మరియు సెక్రటరీ ఈ.సంజీవ రాయుడు తెలిపారు.పట్టణంలో ఉన్నటువంటి స్వాతంత్ర్య సమరయోధులు గాంధీ మహాత్ముడు, పొట్టి శ్రీరాములు, డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ విగ్రహాలకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

**బ్రహ్మంగారిమఠంలో...** మండల కేంద్రంలోని అన్ని ప్రభుత్వ ప్రైవేటు శాఖలు ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు లలో ఘనంగా 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ వీరనారాయణరెడ్డి, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి, ఎస్సార్ శ్రీనివాసులు రెడ్డి, ఎండిఓ రామచంద్రారెడ్డి, సొసైటీ అధ్యక్షులు సాంబశివరెడ్డి,తెలుగుదేశం పార్టీ నాయకులు పూజా శివయ్య యాదవ్, బిజెపి అధ్యక్షుడు చంద్ర ఓబుల్ రెడ్డి,అన్ని శాఖల అధికారులు జాతీయ జెండాను ఎగురవేసి జెండా వందనం చేసి జాతీయ గీతాన్ని ఆలపించారు.

**లక్కిరెడ్డిపల్లి లో...** ఎందరో మహనీయుల త్యాగ ఫలితమే నేడు 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలును మనం జరుపుకుంటున్నామని అన్నమయ్య జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షులు మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఎంపీటీసీ దస్తగిరి, మాజీ ఉప సర్పంచ్ రాజారెడ్డి తో కలిసి త్రివర్ణ పతాకాన్ని ఎగుర వేసి , జాతీయ జెండా కు వందనం చేశారు.మిఠాయిలు పంచిపెట్టి స్వాతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు

**గ్లోబల్ పబ్లిక్ స్కూల్ లో..**

మండల కేంద్రంలోని గ్లోబల్ పబ్లిక్ స్కూల్ నందు 80 స్వాతంత్ర దినోత్సవ వేడుకలను స్కూల్ కరస్పాండెంట్ దాక్షాయని ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

**పుల్లంపేటలో..** స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని పుల్లంపేట జనసేన పార్టీ కార్యాలయంలో జాతీయ జెండాను ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జాతీయవాదులు ప్రజలు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని జాతీయ జెండాకు గౌరవ వందనం సమర్పించారు.














